ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
మంగళవారం 17 జూన్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 28.0

డీపీటీవోగా షబ్నం బాధ్యతలు



ఏలూరు క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా రవాణా శాఖాధికారిగా ఎస్కె షబ్నం సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొవ్వూరు సమీపంలోని దొమ్మేరుకు చెందిన షేక్ షబ్నం ఎంఎస్సి చదివారు. 2011లో కర్నూలు జిల్లా నంది కొట్కూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా చేరారు. తరువాత రావులపాలెం, తణుకు, రాజమహేంద్రవరంలలో డిపో మేనేజర్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ షబ్నం పదోన్నతిపై ఏలూరు జిల్లా డీపీటీవోగా నియతులయ్యారు. ఆమె మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రయాణికుల భద్రత, మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. డిపో మేజనర్ బి వాణి, డీపీటీవో కార్యాలయ అధికారులు, కార్మిక సంఘ నాయకులు, పీఆర్వో నరసింహం శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీడీఏ డీవైఈవోగా ప్రసన్నకుమార్



ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 5 ఏజెన్సీ మండలాల ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల పర్యవేక్షణ, టీచర్ల సర్వీస్ మేటర్ల నిమిత్తం ఐటీడీఏ ఉప విద్యాశాఖాదికారి(డీవైఈవో)గా కె.రవి ప్రసన్నకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గిరిజన సంక్షేమశాఖ కమీషనర్ భార్గవి ఉత్తర్వులు జారీచేయగా డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి తన నియామక వివరాలను తెలియజేశారు. ఇప్పటివరకు ఐటీడీఏ డీవైఈవోగా పనిచేసిన రామ్మోహనరావు పార్వతీపురం మన్యంజిల్లా సీతంపేట ఐటీడీఏ డీవైఈవోగా బదిలీ అయ్యారు.

డీఎస్సీ పరీక్షకు 64మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షకు 64 మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 181 మందికి 179మంది, మధ్యాహ్నం 180 మందికి 164, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో ఉదయం 145మందికి 136, మధ్యాహ్నం 141మందికి 132, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 201 మందికి 190, మధ్యాహ్నం 200మందికి 183 మంది హాజరయ్యారు. మొత్తం 64 మంది గైర్హాజరయ్యారు.

డీఎల్ఎడ్ సెమిస్టర్‌కు 27మంది హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షకు జిల్లాలో 28మంది విద్యార్థులకుగాను 27మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

కొల్లేరు ఆపరేషన్ అనంతరం నెలకొన్న కష్ట, నష్టాలు, ప్రజల జీవన విధానం, మిగులు భూముల వ్యవహారంపై సుప్రీం కోర్టు నియమించిన సాధికార కమిటీ కొల్లేరులో రెండు రోజుల పాటు అధ్యయనం చేయనుంది. అత్యంత కీలకమైన సాధికార కమిటి ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి అభిప్రాయాలను రాతపూర్వకంగా స్వీకరించనుంది. కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మంగళ, బుధవారాల్లో సాధికార కమిటీ పర్యటనకు ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

వస్తున్నారు..


కైకలూరులో కలెక్టర్ వెట్రిసెల్వికి కొల్లేరు ప్రాంతాన్ని చూపిస్తూ వివరిస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, పత్సమట్ల

- కొల్లేరు పర్యావరణ పరిరక్షణ ప్రజల జీవన స్థితిగతులపై అధ్యయనం
- ప్రజాప్రతినిధులు, స్థానికుల అభిప్రాయాల సేకరణ
- అన్ని అంశాలపై పరిశీలన, అధ్యయనం
- పందిరిపల్లిగూడెంలో స్థానికులతో ముఖాముఖి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

2006లో జరిగిన కొల్లేరు ఆపరేషన్ తర్వాత కూడా కొల్లేరు విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడమే కాకుండా, కొందరు ఉల్లంఘిస్తున్నారన్న వాదన లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే కొల్లేరు వాస్తవ పరిస్థితులను జల్లెడ పట్టి తుది నివేదికను మూడు నెలల్లోపు సమర్పించేందుకు వీలుగా సుప్రీం కోర్టు ఆరుగురు సభ్యులతో కూడిన సాధికార కమిటీని పంపుతోంది. కొల్లేరు పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయి, ఎన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి, వారి జీవన విధానం, కొల్లేరు ఆపరేషన్ తదుపరి మార్పులు, జీవన ప్రమాణం మెరుగుపడిందా లేదా అనే అంశాలపై మానవీయ కోణంలో పరిశీలిస్తారు. 2006కు ముందు కూడా సాధికారిత కమిటి కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. తర్వాత మరోమారు ఇదే కమిటి అధ్యయనానికి రాబోతుంది. సాధికార కమిటీ రానున్న నేపథ్యంలో రెండు వారాల క్రితమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కొల్లేరు ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులు సాధికార కమిటీ ఎదుట ఎలాంటి అంశాలను ప్రస్తావించాలో సూచనప్రాయంగా తెలియజేశారు. ఆ ప్రాంతంలో నెలకొన్న స్థితిగతులు మానవీయ కోణంలో పరిష్కారం లభించేలా చూడాల్సిందిగా కొల్లేరు వాసులు కోరుకుంటున్నట్లు యంత్రాంగం కూడా వ్యవహరించాలన్న ధోరణిలోనే కమిటీ సందర్శించనున్న ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించారు. కైకలూరు పరిధిలో అటపాక పక్షుల కేంద్రం, పందిరిపల్లిగూడెం ప్రాంతాల్లో కూడా కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు కూడా ఉన్నారు. పందిరిపల్లిగూడెం వద్ద కొల్లేరు వాసులు తమ కష్ట, సుఖాలు సాధికారిత కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే కొల్లేరు వాసులతో కమిటి సైతం నేరుగా భేటీ అవుతారు. ఒకవైపు అటవీ శాఖాధికారులు, సంబంధిత శాఖాధికారులతో ఆరాతీస్తూనే ఇంకోవైపు పెద్ద సంఖ్యలో తరలివచ్చే కొల్లేరు వాసుల నుంచి కూడా వినతులను ఆలకించబోతున్నారు. పెద్ద ఎత్తున స్థానికులు రానుండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కైకలూరు నియోజకవర్గంలో కమిటీ పర్యటన సాగబోతోంది. బుధవారం ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో కమిటి పర్యటించనుంది.

నేడు, రేపు కొల్లేరు గ్రామాల్లో కేంద్ర సాధికార కమిటీ పర్యటన


కమిటీ సభ్యులు

కొల్లేరులో పర్యటించనున్న కేంద్ర సాధికార కమిటీలో ఐదుగురు సభ్యులు ఉంటారు. చంద్రశేఖర్ గోయల్, డాక్టర్ జేఆర్.భట్, ఎంఎస్.భానుమతి, సునీల్ లిమ్యే, ప్రకాశ్ చంద్రభట్ ఉంటారు.

పర్యటన ఇలా..

- సాధికార కమిటీ మంగళవారం మధ్యాహ్నం 1గంటకు ఏలూరుకు చేరుకుంటుంది.
- 1.30 - 4 గంటల మధ్య కలకుర్రు, మణగునూరు, అటపాక, కొల్లేటికోట సందర్శిస్తారు.
- సాయంత్రం 4 గంటలకు కొల్లేటికోటలో కైకలూరు, ఉండి మండలాలకు చెందిన జిరాయితీ భూములు రైతులు, కొల్లేరు వాసులతో సమావేశం అవుతారు.
- 5 గంటలకు అక్కడ నుంచి బయల్దేరి పైడిచింతపాడు మీదుగా ఏలూరుకు చేరుకుంటారు.
- సాయంత్రం 6 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లో దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు మండలాలకు చెందిన జిరాయితీ భూముల రైతులు, కొల్లేరువాసులు, అధికారులతో సమావేశం అవుతారు.
- 18న ఉదయం 8 గంటల నుంచి 12 .30 గంటల వరకు నిడమర్రు చేరుకుని జిరాయితీ భూములను, కొల్లేరు అభయారణ్య ప్రాంతాలను పరిశీలిస్తారు.

ప్రజలకు జీవనోపాధి కల్పించాలి



పర్యావరణం, పక్షులు ఎంత అవసరమో ప్రజల జీవనోపాధి కల్పించడం కూడా అంతే అవసరం. కొల్లేరులో ప్రజలు ఉన్నట్లు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లామని ప్రత్యేక న్యాయనిపుణులతో కొల్లేరు ప్రజల జీవన స్థితిగతులను కోర్టులో వాదనలు వినిపించడంతో సుప్రీంకోర్టు సాధికార కమిటీ పరిశీలిస్తుంది. సీఈసీ పర్యటనతోనే ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

- కామినేని శ్రీనివాస్, కైకలూరు ఎమ్మెల్యే

సమస్యను సీఈసీ దృష్టికి తీసుకువెళ్లాలి



కొల్లేరు సమస్యను అర్జీల రూపంలోనే ప్రజలు కమిటీకి వివరించాలి. పర్యావరణం, పక్షులతో పాటు ప్రజలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. సీఈసీ కమిటీ పూర్తిగా అధ్యయనం చేసేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నాం. కైకలూరు, మండవల్లి మండలాలతో పాటు ఉంగుటూరు, నిడమర్రు, కొల్లేరు గ్రామాల్లో సైతం కమిటీ పర్యటిస్తుంది.

- పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే

సమాయత్తం కండి : కలెక్టర్

కైకలూరు, ఉంగుటూరు, భీమడోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొల్లేరులోని వాస్తవ పరిస్థితులను సీఈసీ కమిటీకి వివరించేందుకు అధికారులు, ప్రజలు సమాయత్తం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో ఉప్పుటేరు, పందిరిపల్లిగూడెం, ఆటపాక పక్షుల కేంద్రాన్ని, మణుగులూరు, పుల్లపర్రు గ్రామాలను ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎఫ్‌వో బి.విజయ, కైకలూరు రేంజర్ రామలింగాచార్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సాధికార కమిటీ మంగళవారం శ్రీపర్రు, మణుగులూరు, ఆటపాక పక్షుల కేంద్రం, పందిరిపల్లిగూడెంలో కొల్లేరు ప్రజలను కలుస్తారు. అనంతరం దెందులూరు మండలంలోని కొల్లేరు గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. 3గంటలకు పందిరిపల్లిగూడెంలో కొల్లేరు లంక గ్రామాల ప్రజలు అర్జీలను కమిటీకి అందిస్తారన్నారు. అనంతరం నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలా పరిధిలోని గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు.

కైకలూరు మండలం పందిరిపల్లిగూడెంలో కైకలూరు, మండవల్లి మండలాల కొల్లేరు ప్రజల సమస్యలను చెప్పుకునేందుకు సభా వేదికను ఏర్పాటుచేస్తున్నారు. ఖాళీ ప్రదేశంలో సభాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు.


పందిరిపల్లిగూడెంలో సభా వేదిక ఏర్పాట్లు


కలెక్టరేట్ వద్ద షెడ్‌లో ప్రజల అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ఏలూరు రూరల్/టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 376 అర్జీలను స్వీకరించారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు. నిబంధనల మేరకు ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, లేకుంటే దరఖాస్తుదారులకు కారణాలను తెలియజేయాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సీఈవో శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, దేవకీదేవి వినతులు స్వీకరించారు.

కలెక్టరేట్‌లో షార్ట్ సర్క్యూట్

కలెక్టరేట్‌లో అధికారులు అర్జీలు స్వీకరిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. జేసీ ధాత్రిరెడ్డి విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సరిచేసి సరఫరా పునరుద్ధరించారు. దీనితో కొద్దిసేపు కలెక్టరేట్ బయట షెడ్‌లో అర్జీలు స్వీకరించారు.


ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

జంగారెడ్డిగూడెంలో అర్జీలు స్వీకరించిన ఎస్పీ

జంగారెడ్డిగూడెం/ఏలూరు క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆండ్రాయిడ్ ఫోన్ల వాడకంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. సీబీఐ, ఈడీ అధికారులమంటూ ఫోన్లు చేసి బెదిరించడం, ఫోన్లు చేసి వ్యాక్సిన్ కోసం ఒకటి నొక్కండి అనే కాల్స్ చేసి మోసం చేసే ముఠాలు బారిన పడవద్దని, తెలియని మెస్సేజ్‌లు కాని లింకులకు కాని స్పందించవద్దని సూచించారు. ఏఐ ఉపయోగించి ఫిర్యాదుల ప్రక్రియను పారదర్శకంగా కాగిత రహితంగా నిర్వహించారు. సైబర్ నేరానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. డీఎస్పీ రవిచంద్ర, సీఐ కృష్ణ బాబు, ఎస్ఐ జబీర్ పలువురు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. 40 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఆస్తి పన్ను భారం..!



ప్రస్తుత డిమాండ్‌కు అదనంగా 20 శాతం వడ్డింపు?

గత వైసీపీ ప్రభుత్వ హయాలో ఏటా 15 శాతం చొప్పున ఆస్తిపన్ను పెంపు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చిన వెంటనే పెంచిన ఆస్తి పన్నులను సమీక్షించి పెంపుదల నిరోధిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. అధికారంలోకి రాగానే ప్రస్తుత డిమాండ్‌పై కనీసం 20 శాతం ఆస్తి పన్ను పెంచాలని ప్రభుత్వం మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణాల్లో ఆస్తి పన్ను భారీగా పెరగనున్నాయి. పెంపు నిర్ణయం తగదని పలువురు విమర్శిస్తున్నారు.

- మునిసిపాలిటీ, కార్పొరేషన్లకు ఉత్తర్వులు
- పెంపుదల సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో రూ.11 కోట్లు అదనపు భారం

నూజివీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మునిసిపాలిటీల ద్వారా రూ.463.93 కోట్లు అదనంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్ అదనంగా ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు అధికార వర్గాల సమాచారం. జిల్లాలో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి అదనంగా రూ.11 కోట్లు భారం పడనుంది. ఏలూరు కార్పొరేషన్ నుంచి ప్రస్తుత డిమాండ్‌కు అదనంగా రూ.7,71,31,859, నూజివీడు మునిసిపాలిటీ నుంచి అదనంగా రూ.1,39,93,273, జంగారెడ్డిగూడెంలో రూ.1,56,22,884, చింతలపూడి రూ.32,12,573 ప్రజలపై అదనపు భారం మోపనున్నారు. ఇప్పటికే మునిసిపల్ సిబ్బంది ఇంటింటికి తిరిగి అదనపు నిర్మాణాలు ఉన్నాయా, గతంలో పన్నులు తక్కువగా వేసి ఉందా? వంటి విషయాలను సర్వే చేసి సేకరించి నమోదు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత వైసీపీ ప్రభుత్వం ఇంటి అద్దె విలువల ఆధారంగా ఆస్తి పన్ను లెక్కించే విధానాన్ని మార్చి ఆస్తి క్యాపిటల్ విలువ మీద ఆస్తి పన్ను లెక్కించే విధానాన్ని అమలు చేసింది. దీని కోసం మునిసిపల్ చట్టాన్ని సవరణ చేస్తూ 44/2020 చట్టాన్ని తెచ్చారు. ఈ నిర్ణయాన్ని ఆనాడు ప్రజలు తెలుగుదేశం పార్టీ, వామపక్ష పార్టీలు వ్యతిరేకించాయి.

గుండెలు గుభేల్

2020 నాటికి ఉన్న పన్నులపై ఏటా 15 శాతం చొప్పున కాంపౌండింగ్ విధానంలో పన్నులు పెంచుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు అదనంగా ఏ కొద్ది నిర్మాణం జరిగినా అదనపు నిర్మాణంతో సహా మొత్తం బిల్డింగ్‌కు ప్రస్తుత ఆస్తి కాపిటల్ విలువపై పన్ను లెక్కించి, పన్ను విధిస్తారు. అంటే ఏటా 15 శాతం పెంచడం రద్దయి ప్రస్తుతం ఉన్న ఆస్తి క్యాపిటల్ విలువ మీద మొత్తం బిల్డింగ్‌కు పన్ను విధిస్తారు. ఇది ఏటా పెరుగుతూ పోతుంది. 2020 తర్వాత కట్టిన ఇళ్లకు తక్కువ అసెస్మెంట్ చేసే అవకాశం లేదు. 2020కి ముందున్న ఇళ్లకు ఆనాటి పన్ను మీద ఏటా 15 శాతం చొప్పున కాంపౌండింగ్ విధానంలో పెంచుతూ వచ్చారు. ఈ ఐదేళ్లలో అది 100 శాతం పెరిగింది. భవనం ప్లాన్ లేకుండా నిర్మిస్తే దానికి ప్రస్తుతం ఆస్తి క్యాపిటల్ విలువ మీద మొత్తం బిల్డింగ్‌కు పన్ను పడడంతో పాటు అనుమతి లేకుండా నిర్మించారు కాబట్టి పన్ను మొత్తం ఎంత ఉందో అంతే మొత్తం పెనాల్టీ వేసి దానిని నిరావధికంగా వసూలు చేస్తారు. అంటే పన్ను డబుల్ అవుతుంది.

హామీ నిలబెట్టుకోండి



ఆస్తి పన్ను పెంచబోమని కూటమి పార్టీలు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. ఆస్తి పన్ను పెంపు నిర్ణయంతో ప్రజలకు ఆస్తి ద్వారా వారికి వచ్చే ఆదాయం కంటే ప్రభుత్వానికి చెల్లించే పనులు ఎక్కువై ప్రజలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఎదురవుతుంది. జగన్ అవలంబించిన ప్రజా వ్యతిరేక నిర్ణయాలు భరించలేకే కూటమికి ప్రజలు భారీ విజయం కట్టబెట్టారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలి. పన్ను విధింపులపై కేంద్ర ఆదేశాలను గుడ్డిగా అమలు పరుస్తూ ప్రజలపై పన్నుల భారం మోపడం సరికాదు.

- జి.రాజు సీపీఎం నాయకుడు

అతిసార వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే

ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అతిసార వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు జూన్ 31 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే కార్యక్రమాన్ని సోమవారం జేసీ ధాత్రిరెడ్డి ప్రారంభించారు. వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన స్టాప్ డయేరియా కాంపెయిన్ వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. వర్షాకాలం కలుషిత నీటి కారణంగా అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో 1822 మంది ఆశా కార్యకర్తలు, 605 మంది ఏఎన్ఎంలు, 463మంది ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటా సర్వే నిర్వహించి ఐదేళ్లలోపు వయస్సు పిల్లలకు రెండు చొప్పున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేస్తారని వివరించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఫోన్‌నంబరు 99123 41488తో ఏర్పాటుచేశారని తెలిపారు. డీఎంహెచ్‌వో మాలిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఇన్‌చార్జి డీఐవో డాక్టర్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకుల ముందు నిలిపిన వాహనాలు

తల్లికి వందనం డబ్బుల కోసం బ్యాంక్‌లు కిటకిట

ట్రాఫిక్ జాం

కుక్కునూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులను తల్లుల ఖాతాలో జమ చేయడంతో బ్యాంకులు కిటకిటలాడుతున్నాయి. కుక్కునూరులోని యూనియన్ బ్యాంకు సోమవారం మహిళలు భారీగా తరలి వచ్చారు. నగదు నిల్వ తెలుసుకోడానికి కొందరు, డబ్బులు తీసుకోవడానికి కొందరు బ్యాంకులకు తరలివచ్చారు. రోడ్డుపక్కనే వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. చాలా సేపు వాహనాలు నిలిచిపోయాయి.



ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేరు

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిభారం

- 604 సచివాలయాల్లో 342 మంది ఇంజనీర్లు
- ఒక్కొక్కరికి నాలుగు చోట్ల బాధ్యతలు
- పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు

ఏలూరు రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా సగం మంది కూడా ఇంజనీర్లు లేకపోవడంతో ఉన్నవారిపైనే పని భారం పడుతోంది. మొత్తం 604 గ్రామ సచివాలయాల్లో 342 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే పనిభారం పడుతోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఒక్కొక్క ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు నాలుగేసి గ్రామ సచివాలయాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో ఇప్పటికీ ఇంజనీరింగ్ పోస్టులు భర్తీ కాలేదు. దీనితో గ్రామాల్లో జరిగే పంచాయతీరాజ్ పనులపై ప్రభావం పడుతోంది. క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ, ఎంబుక్ రికార్డు నమోదు, అంచనాల తయారీ తదితర పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది. నాలుగేసి సచివాలయాల్లో పనులు చూడడం తలకు మించిన భారంగా ఉందని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. బదిలీలు చేపడితే సమస్య మరింత తీవ్రమవుతుందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.



ఒక్కసారిగా.. జోరువాన

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

ఐదేళ్లలో అక్రమంగా 25 కేసులు పెట్టారు
వాయిదాలకు ప్రజాప్రతినిధుల కోర్టుకు మంత్రి నిమ్మల

ఆర్జీయూకేటీ ప్రవేశాలకు స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్
174 మంది విద్యార్థులు హాజరు

లోపలి పేజీలో..

అంతా మా ఇష్టం..!





భీమవరంలో నంబర్ లేని వాహనాలపై రయ్..రయ్

ఎవరి దారి వారిదే.. ట్రాఫిక్ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడపటం...ఇలా నిబంధనలు పాటించకుండా నిత్యం ప్రయాణాలు కొనసాగిస్తూనే ఉన్నారు. భీమవరం పట్టణం ఇటీవల జిల్లా కేంద్రం కావడంతో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుని వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు.







సెల్‌ఫోన్ మాట్లాడుతూ బైక్ రైడింగ్..



ఫొటోలు :
- ఫొటోగ్రాఫర్
భీమవరం /ఏలూరు




ఏలూరులో అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



వాహనాల చట్టం ప్రకారం త్రిబుల్ రైడింగ్ నేరం.. కానీ భీమవరం పట్టణంలో ముగ్గురు కాదు.. ఏకంగా ఆరుగురు ఒకే బైక్‌పై ప్రయాణిస్తుండగా చూసిన జనం జాగ్రత్త సోదరా.. అంటూ సలహా ఇచ్చారు...



అడ్డదిడ్డంగా..




నంబర్ ప్లేటు మాకెందుకు



ప్రాబ్లమ్ జోన్



పట్టెన్నపాలెం బ్రిడ్జికి మోక్షం లేదా ?

జంగారెడ్డిగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగుపై బ్రిడ్జి పనులకు కూటమి ప్రభుత్వం రూ.3.2 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులకు టెండర్లు పిలిచి నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడంలేదు. ప్రస్తుతం మంజూరైన నిధులు మార్కెట్ ధరలకు అనుగుణంగా లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా వర్షాకాలంలో జల్లేరు వాగు పొంగితే పట్టెన్నపాలెం నుంచి ఏజెన్సీ గ్రామాలకు, ఏజెన్సీ గ్రామాల నుంచి జంగారెడ్డిగూడెం వైపుకు రాకపోకలు నిలిచి పోతాయి. వాగు ఉధృతంగా ప్రవహించి నప్పుడు అనేక మంది రైతులు, ప్రజలు వాగులో ప్రమాదవశాత్తు పడి మృత్యువాత పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ఘటనలను ఆధారం చేసుకుని ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వ సహకారంతో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కృషితో రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్) నిధులు రూ.కోటితో పట్టెన్న పాలెంలోని జల్లేరు వాగు బ్రిడ్జి పక్క నుంచి కాజ్‌వే నిర్మాణానికి ఆర్ అండ్ బి శాఖ చర్యలు చేపట్టింది. భీమవరానికి చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండరు దక్కించుకుని పనులు నిర్వహిస్తున్నది. ప్రధాన బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రజలు ఇబ్బందులు పడ కుండా కాజ్‌వే నిర్మాణం చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• వేగంగా కాజ్‌వే పనులు

పట్టెన్నపాలెంలోని జల్లేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలిచాం. ఇప్పటి వరకు ఎవరూ టెండరు వేయలేదు. ఈ వర్షాకాలంలో ప్రజలు జల్లేరు వాగు వల్ల ప్రమాదాల బారిన పడకుండా ఉండటానికి ప్రభుత్వం ప్రస్తుతానికి కాజ్‌వే నిర్మాణానికి ఎస్‌డిఆర్ఎఫ్ నిధులు రూ.కోటి మంజూరు చేయడంతో ఆ పనులు వేగంగా జరుగుతున్నాయి. వర్షాకాలం రాకుండానే పనులు పూర్తి చేసేలా కృషి చేస్తాం.ప్రధాన బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా కూడా ప్రజలు కాజ్‌వే ఉపయోగించుకోవచ్చు.

సీహెచ్.హరికృష్ణ, ఆర్అండ్‌బీ డీఈఈ, జంగారెడ్డిగూడెం

పెదవేగి జడ్పీ స్కూల్‌లో అవస్థలు

మరుగుదొడ్లు లేక విద్యార్థుల ఇబ్బందులు



పాఠశాల.. పక్కనే ఉన్న చెరువు



పెదవేగి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 280 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వారిలో సగంమంది బాలికలు ఉన్నారు. ఇక్కడ బాలికలకు సంబంధించి మూడు టాయిలెట్‌లు మాత్రమే ఉన్నాయి. మరుగుదొడ్లు ఒక్కటి కూడా లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాలురతో పాటు పాఠశాల సిబ్బందికి ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు. దీంతో పాఠశాలకు సమీపంలోఉన్నచెరువు గట్టే ప్రస్తుతం విద్యార్థుల మూత్ర విసర్జనకు ఉపయోగపడుతోంది. ఆ చెరువు కూడా జల్‌జీవన్ మిషన్‌లో లోతుగా తవ్వడం, వర్షాకాలం కావడంతో అటుగా వెళ్లే విద్యార్థులు ప్రమాదానికి గురవుతారనే ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారు. దీనిపై గ్రామానికి చెందిన తొంటా తాతయ్య అనే వ్యక్తి రెండు పర్యాయాలు పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతులు అందించారు. గత ఏప్రిల్ 28వ తేదీన మరోసారి కలెక్టర్‌కు అర్జీ పెట్టాడు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి మరుగుదొడ్ల సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పెదవేగి వచ్చి, పాఠశాలల పునఃప్రారంభం నాటికి మరుగు దొడ్లను నిర్మిస్తామని సమస్య పరిష్కార మైనట్లు సంతకం పెట్టాలని చెప్పడంతో ఫిర్యాదుదారుడు సంతకం పెట్టేశాడు. దీంతో సమస్య పరిష్కారమైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పైఅధికారులకు నివేదించారు. ఇప్పుడు పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.హైస్కూల్ వరకు గత విద్యా సంవత్సరం ఆధారంగా బాల బాలికలు 240 మంది ఉన్నారు. ఇంటర్మీడి యట్‌కు సంబంధించి మరో 33 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల సిబ్బంది 15 మంది ఉన్నారు. బాలికలకు ఉన్న మూడు మూత్రశాలలు కూడా అధ్వాన్నంగా ఉన్నాయి. మొత్తంగా 300 మంది వరకు ఉన్న ఈ పాఠశాలలో కనీసం 20 మరుగు దొడ్లు ఉండాలి.

అధికారులు దృష్టి పెట్టాలి



ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం 5గంటల వరకు. 8 గంటల పాటు అదే పాఠశాలలో ఉండాలి. 140 మంది బాలికలు ఉన్న ఈ పాఠశాలలో కేవలం మూడు మూత్రశాలలు మాత్రమే ఉంటే విద్యార్థినుల పరిస్థితి ఏమిటి.? కొంతమంది తల్లిదండ్రులు మరుగుదొడ్లు లేకపోతే మా పిల్లలను పాఠశాలకు పంపమంటున్నారు. అధికారులు స్పందించి, మరుగుదొడ్లు నిర్మించి విద్యార్థుల అవస్థలను తొలగించాలి..

- పజ్జూరి శివన్నారాయణ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్

డేంజర్‌లో నారాయణపురం వంతెన

ఉంగుటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలంలో డెల్టా-మెట్ట ప్రాంతాన్ని కలిపే నారాయణపురం వంతెన శిథిలావస్థకు చేరి కూలే పరిస్థితిలో ఉంది. 1932లో ఈ వంతెన నిర్మించారు. సుమారు తొంభై మూడేళ్ల సేవలందించిన ఈ వంతెన ఇటీవల లోడు లారీలు, చేపలు, క్వారీ లారీలు విపరీతమైన రద్దీ పెరగడంతో వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఆదివారం వంతెన ఎడమ వైపు అంచులు కుంగడంతో పాటు వంతెన కింది భాగంలో పెచ్చులూడిపోయాయి. దీంతో అప్రమత్తమైన ఆర్అండ్‌బీ అధికారులు తారు డబ్బాలను అడ్డుగా పెట్టి భారీ వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనదారులను మాత్రమే అనుమతిస్తున్నారు. సుమారు 150 గ్రామాల ప్రజలకు మార్గమైన ఈ వంతెన శిథిలావస్థకు చేరడంపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల దృష్టికి ఈ వంతెన సమస్య తీసుకువెళతానని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చెప్పారు. తక్షణం నిధులు మంజూరు చేయించే ప్రయత్నం చేస్తానన్నారు. మూడేళ్ల క్రితం మట్టి పరీక్షలు నిర్వహించి బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.50 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

వంతెన నిర్మించాలి



చాలా పురాతన వంతెన ఇది. ఎప్పటి నుంచో మరమ్మతులకు గురైంది. అత్యవసరంగా ఈ వంతెన నిర్మించకపోతే సుమారు 150 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదముంది.పాలకులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

నల్లా ఆనంద్, స్థానికుడు



డబ్బాలను అడ్డు పెట్టి ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు

వంతెన అంచుకు పడిన రంధ్రం



పెనుమంట్ర-నత్తారామేశ్వరం దారిలో మట్టితో పేరుకుపోయిన రోడ్లు

జారి పడతారు..జాగ్రత్త !

మట్టి పేరుకుపోయి రహదారులు బురదమయం

పెనుమంట్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనుగొండ - నత్తారామేశ్వరం రహదారిపై ప్రయాణిస్తున్నారా..అయితే వర్షం కురిస్తే తస్మాత్ జాగ్రత్త. ఇరగవరం మండలం కంతేరు నుంచి పెనుమంట్ర మండలం జుత్తిగ వరకు మట్టి మాఫియా వేసవి కాలంలో రాత్రి పగలు తేడా లేకుండా మట్టి రవాణా చేశారు. రోడ్లపై మట్టి బెరడ్లు పడి మట్టి పేరుకుపోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే రహదారి బురదగా మారి వాహనాలు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది పెనుగొండ మండలం వడలిలో ఆర్అండ్‌బీ రహదారిపై యాక్టివా అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు దెబ్బ తగిలి అక్కడకక్కడే ఇద్దరు మహిళలు మృతి చెందారు. రహదారులన్నీ ప్రయాణికులకు శాపంగా మారాయి. అధికారులు కళ్ళు తెరిచి రహదారిపై ఉన్న మట్టి సుద్దలను తొలగించి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జారుడు బల్లలా గొల్లల కోడేరు- మహదేవపట్నం రోడ్డు →



పాలకోడేరు : గొల్లలకోడేరు- మహదేవ పట్నం గ్రామానికి వెళ్ళే రహదారి జారుడు బల్లలా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొల్లలకోడేరు గ్రామం మీద నుంచి మహదేవపట్నం, ఉండి వెళ్ళేందుకు ఇది ఎంతో అనువైన మార్గం. పంట పొలాల మధ్యలో నుంచి గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ రహదారి ఉంది. ఈ రహదారికి ఐదు సంవత్సరాలుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో గొల్లలకోడేరు పరిధిలో ఉన్న రహదారి మొత్తం పూర్తిగా పాడైపోయింది. గోతులు పడి బురదమయంగా మారింది. ఈ వేసవిలో మట్టి ట్రాక్టర్లతో ట్రాక్టర్ల ద్వారా, లారీలతో మట్టిని తోలుకెళ్ళడంతో రహదారిపై మట్టిబెడ్డలు పడి జారుడు బల్లలా తయారైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు జారిపడి గాయాలపాలయ్యారు. ఈ రహదారి వెంబడి పంట పొలాలతోపాటు సీతారామపురం, తమ్మగుంటపాలెం, తోడిగుల్లవారిపాలెం, గుబ్బలవారి పాలెంలలో ప్రజలు నివసిస్తారు. నిత్యం వారంతా ఈ రహదారి మార్గం మీదే ప్రయాణాలు సాగించాల్సి ఉంటుంది. అటువంటి ఉపయోగకరమైన రహదారి పూర్తిగా పాడవడంతో గొల్లలకోడేరు ప్రాంత వాసులే కాకుండా ఉండి మండల ప్రజలు కూడా ఈ రోడ్డుకి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.



జీఅండ్‌పీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

తూడు తొలగించండి సారూ !

పెనుమంట్ర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పెనుమంట్ర మండలంలోని ప్రధాన సాగు నీటి కాల్వ అయిన గోస్తనీ వెంకయ్య కాలువ పరిధిలోని మాముడూరు బ్రిడ్జి వద్ద ఎగువ నుంచి వచ్చిన చెత్తాచెదారం, తూడు పేరుకు పోవడంతో ప్రవాహానికి అవరోధం ఏర్పడింది. వేసవిలో గుర్రపు డెక్క, తూడు తొలగింపు మందు పిచికారీ చేస్తారని కానీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బ్రిడ్జి వద్ద తూడు గుర్రపు డెక్క ప్రవాహానికి అడ్డుగా మారింది. వేల్పూరు నుంచి కాళీపట్నం వరకు ఈ కాలువ ద్వారా తాగు సాగునీరు సరఫరా జరుగుతుంది. భీమవరం పట్టణానికి దాహార్తిని తీర్చే ప్రధాన కాలువ అయిన జీఅండ్‌వీ కెనాల్ కెనాల్‌లోని వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆచంట : మండలంలో ఉన్న ప్రధాన మురుగుడ్రెయిన్‌లు అనేక చోట్ల గుర్రపు డెక్కతో నిండి ఉంది. మండలంలో తాడేరు, కొరాలపర్రు, నక్కల డ్రెయిన్లు ఉన్నాయి. కొన్నిచోట్ల ఉపాధి కూలీల ద్వారా తూడు తొలగించినప్పటికి ఇంకా అనేక చోట్ల గుర్రపు డెక్కతో డ్రెయిన్లు నిండి ఉన్నాయి. కనీసం గుర్రపుడెక్క అయినా పూర్తిస్థాయిలో తొలగించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన తాడేరు డ్రెయిన్

ఏటిగట్టు..తవ్వి వదిలేశారు..



పోలవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో గూటాల తాడిపూడి గ్రామాల మధ్య ఏటిగట్టుకి ఇసుక ర్యాంపు నిర్వహణ కోసం భారీ గండికొట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాల సీజను ప్రారంభమైంది . దీనికి తోడు గోదావరి నీటిమట్టం కూడా క్రమక్రమంగా పెరుగుతోంది. గోదావరి నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకున్న సందర్భాల్లో ఈ గండి కొట్టిన ప్రాంతాల నుంచి గోదావరి జలాలు ప్రవహిస్తే ఏటిగట్టు కోతకు గురై పెనుప్రమాదం జరిగి గ్రామాలు పంటపొలాలు నీటమునిగే ప్రమాదముంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తీసిన సిల్ట్ తీసినట్లే.. డ్రైనేజీలోకి..

నరసాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో చేయాల్సిన పనుల్ని వానలు పడుతున్న సమయంలో చేయడంతో లక్షల రూపాయలు వృథా అవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న మునిసిపాలిటీ తాజాగా చేపట్టిన డ్రైనేజీ లోంచి సిల్ట్ తొలగింపు పనులపై కూడా ప్రజలు నుంచి విమర్శలు ఎదురుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నరసాపురంలో సుమారు 26 కిలోమీటర్ల మేర మేజర్ డ్రైనేజీలు విస్తరించాయి. ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఈ డ్రైనేజీల్లో సిల్ట్ తొలగిస్తుంటారు. అయితే ఈసారి రూ 40 లక్షలతో టెండర్లు పిలిచారు. అయితే ఈపనుల్ని ఎండాకాలంలో చేపట్టకుండా వర్షాలు కురుస్తు న్నప్పుడు ఆగమేఘాలపై ప్రారంభించారు. వర్షాలు పడుతుండటంతో చేసిన పనులకు ప్రయోజనం లేకుండా పోతోంది. డ్రైనేజీ ల్లోంచి తీసిన సీల్ట్ తీసినట్లే.. వర్షాలకు మళ్లీ డ్రైనేజీ ల్లోకి జారిపోతుంది. రహదార్లపైకి బురద వస్తుండంతో ప్రజలు వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. చేస్తున్న పనులకు ఉపయోగం లేకుండా పోతోందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.





విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద మాట్లాడుతున్న మంత్రి

ఐదేళ్లలో నాపై 25 అక్రమ కేసులు పెట్టారు

వాయిదాలకు ప్రజా ప్రతినిధుల కోర్టుకు మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తనపై అక్రమంగా 25 కేసులు బనాయించారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. వాయిదాలకు హాజరవుతున్నానని, ఈ నెల 23 నాటికి మరలా వాయిదా వేసినట్టు తెలిపారు. 2019 ఆగస్టులో వైసీపీ ప్రభు త్వం ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు వారికి న్యాయపరంగా అండగా నిలిచినందున ఆనాడు తనపై అక్రమ కేసు పెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకూ ఐదేళ్ళుగా విజయ వాడలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరవుతున్నానని వివరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం రెడ్ బుక్ గురించి వైసీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. 2014లో తొలిసారిగా, 2019లో రెండోసారి నాపై ఒక్క ఎఫ్ఐఆర్ లేదని మూడోసారి 2024లో మాత్రం 5 ఏళ్లలో 25 కేసులు నమోదు అయినట్టు అఫిడవిట్ దాఖలు చేయాల్సి వచ్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ఐదేళ్ల కక్షపూరి తంగా కేసులు పెట్టి వేధించారని అన్నారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, ధనాని ప్రకాష్ తదితరులు ఉన్నారు.

19న ఐదు వేల మందితో యోగా



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

భీమవరంటౌన్, జూన్ 16(ఆంధ్ర జ్యోతి): భీమవరంలో ఈ నెల 19న రాష్ట్ర స్థాయి సన్నద్ధత సామూహిక యోగా కార్యక్రమ నిర్వ హణపై కలెక్టర్ నాగ రాణి, ఇతర ఉన్నతాధి కారులు బీవీ రాజు కళాశాలలో ఏర్పాట్లు పరిశీలించారు. ఐదు వేల మంది అథ్లెట్లు, స్పోర్ట్స్ పర్సన్స్, యువత పాల్గొంటున్నారని తెలిపారు. విష్ణు కాలేజీ ప్రాంగణంలోని నాలుగు ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమానికి అధికారులు భారీ ఏర్పాట్లకు ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు అవుతారన్నారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సంకు అప్పారావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సంకు అప్పారావు జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు సంకు అప్పారావు జీవితం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం అప్పారావు 109వ జయంతి సందర్భంగా తణుకు స్వాతంత్ర్య సమర యోధుల పార్కు వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఆయన కుమార్తె సంకు మనోరమ మాట్లాడుతూ తన తండ్రి తణుకు హైస్కూలులో చదివారని, మూర్తిరాజు, ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ వంటి ప్రముఖుల సహాధ్యాయులని తెలిపారు. స్వరాజ్య ఉద్యమంలో 1937లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని, కాళీపట్నం జమిందారీ వ్యతిరేక పోరాటంలో తొలి సత్యాగ్రహ బృందానికి నాయకత్వం వహించి అరెస్ట య్యారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ సంకు అప్పారావు ఆదర్శనీయుడన్నారు. డీవీవీఎస్ వర్మ, చల్లా హైమవతి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, వంక రామదాసు, భూపతిరాజు రమేష్ చంద్ర బాబు, పోరూరి మురళీకుమార్ మాట్లాడారు. ముందుగా సంకు అప్పారావు కుటుంబ సభ్యులు మనోరమ, సూర్యకుమారి, విజయకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సీఏటీ జడ్జిలు

ద్వారకాతిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ) జడ్జిలు సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన జడ్జిలు డా. లతా బస్వరాజ్ పాట్నే, షాలిని మిశ్రా(రిటైర్డ్ ఐఏఎస్), రిజిస్ట్రార్ జి. నవీన్‌కుమార్, కాట్ సిబ్బందికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. వీరంతా ముందుగా స్వామి, అమ్మ వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు వారికి స్వామివారి శేషవస్త్రాన్ని అందించి వేదా శీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ ఏఈవో రమణరాజు, సూపరింటెండెంట్ హయగ్రీవ వారికి స్వామి వారి చిత్రపటాలను, ప్రసాదాలను అందజేశారు.

బాల బాలికలకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం శనివారపుపేట లోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ప్రతి బాల బాలికలు గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం ఈ వసతి గృహంలో 9 మంది బాలలకు గుర్తింపు కార్డులు లేవని, కార్డుల జారీకి తగిన చర్యలను త్వరలోనే తీసుకుంటామని తెలిపారు. అలాగే వసతి గృహ సిబ్బందితో మాట్లాడుతూ బాలలకు పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. బాలుర వసతి గృహ సూపరింటెండెంట్ శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీల అభ్యంతరాలపై గ్రీవెన్స్ సెల్

ఏలూరు అర్బన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా పరిధిలోని 48 మండలాల ఉపాధ్యాయులకు ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్, మాన్యువల్ కౌన్సెలింగ్‌పై ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలుంటే వాటిని సరైన నమూనాలో తగిన ఆధారాలను జతచేసి ఏలూరు డీఈవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌లో అందజేయాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 76 మందికి, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు 2274, ఎస్జీటీలు 2159, లాంగ్వేజ్ పండిట్లు 42, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 33 మందికి, ఆర్ట్/ డ్రాయింగ్/ క్రాఫ్ట్/ మ్యూజిక్/ ఒకేషనల్ ఉపాధ్యాయులు 16 మందికి కలిపి మొత్తం 4884 మందికి నిర్ణీత గడువులో ట్రాన్స్‌ఫర్లు పూర్తిచేశామన్నారు.

స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలో గల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో స్పోర్ట్స్ విభాగంలో 62 మంది, ఎన్‌సీసీ 85, క్యాప్ విభాగంలో 12 మంది, భారత్ స్కౌట్ విభాగంలో 15 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు.

ఒక్కసారిగా..జోరువాన





భీమవరం టౌన్/ పోలవరం జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : సోమవారం సాయంత్రం వివిధ ప్రాంతాల్లో ఒక్కసారిగా జోరు వాన కురిసింది. సాయంత్రం 6 గంటల సమయంలో భీమవరంలో ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు రావడం గాలులు, ఉరుములతో వర్షం ప్రారంభమైంది. దాదాపు అర గంటపాటు కురిసిన వర్షంతో జనజీవనం స్థంభించింది. ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. భారీ వర్షంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పోలవరం మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పోలవరం మండల కేంద్రంలో మెయిన్ బజార్, బీసీ కాలనీ, కొత్తపేట, బాపూజీ కాలనీ, బెస్తావీధిలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దిగువ పోలవరంలో వర్షపు నీరు అటు గోదావరిలోకి, ఇటు కొవ్వాడ కాలువ ఛానల్‌లోకి వెళ్ళే మార్గం లేక వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచి నీటినిల్వలు పెరిగాయి. పట్టిసీమ, గూటాల కొత్తపట్టిసీమ గ్రామాలలో ఏటిగట్టుకి దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలు జలమయమై నివాసాల చుట్టూ నీరు చేరాయి.











భీమవరంలో అకస్మాత్తుగా వచ్చిన వర్షానికి జనం పరుగులు..

నారికేళం.. ప్రియం..

ధర ఆల్‌టైం రికార్డ్

వెయ్యి కాయలు పశ్చిమలో రూ.16 వేలు..

తూర్పులో రూ.18 వేలు

ఆగస్టు నాటికి రూ.25 వేలకు చేరే అవకాశం

రిటైల్ మార్కెట్‌లో కాయ గరిష్ట ధర రూ.30

పాలకొల్లు/యలమంచిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నారికేళం ధరం మును పెన్నడూ లేని స్థాయిలో చుక్కలనంటుతోంది. పెరిగిన ధరలు ఆల్‌టైం రికార్డు నెలకొల్పాయి. పాత పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ వెయ్యి కాయల ధర గరిష్ఠంగా రూ.16 వేలు ఉండగా, పాత తూర్పుగోదావరి జిల్లాలో రూ.18 వేలు ఉంది. ఈ ధరలు గత ధరలతో పోలిస్తే ఆల్‌టైం రికార్డుగా కనిపిస్తోంది. జులై మాసాంతం, ఆగస్టు నెల నాటికి ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ధరలతో పోలిస్తే పెరిగిన ధరలు రైతులకు సంతృప్తిని ఇస్తున్నప్పటికీ కొబ్బరి దిగుబడి, నాణ్యత తగ్గడంతో కొంతమేర ఆదాయాన్ని కోల్పోతున్నారు. గడచిన మూడు, నాలుగేళ్లలో ఈ ఏడాది మినహా కొబ్బరి ధరలు తక్కువగానే ఉన్నాయి. దీంతో రైతులు కొబ్బరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు ఆసక్తి కనబరచలేదు. కొబ్బరిచెట్లకు సకాలంలో సేంద్రీయ, రసాయన ఎరువులు వేయక పోవడం, దుక్కి, నీటి తడులు ఎక్కువసార్లు పెట్టకపోవడంతో పాటూ, కొబ్బరిచెట్లకు తెగులుసోకడంతో కాయ పరిమాణం తగ్గింది. ప్రతి వంద కాయలలో 20 నుంచి 30 చిన్న కాయలు వస్తున్నాయి. ఈ కాయలను వర్తకులు రెండుకాయలను ఒక కాయగా లెక్కించి తీసుకుంటున్నారు. అంతేకాక వర్తకులు 100 కాయలకు ఆరు కాయలను శనగకాయలుగా పరిగణించి తీసుకెళ్లేవారు. ఇప్పుడు వర్తకులు సిండికేట్‌గా మారి నూటికి 10 కాయలను తీసుకోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మరోవైపు దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే ఇప్పుడు కొబ్బరి రైతులు సంతృప్తిగానే ఉన్నారు.పూర్వ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. పచ్చికొబ్బరి గండేరా(ఢిల్లీ క్వాలిటీ) రూ.18వేల నుంచి రూ.20 వేలు పలుకుతోంది. కురిడీకాయలు రూ.25 వేలు ధర ఉంది. 70-80 బత్తీల



కాయలు వెయ్యి ధర రూ.10 వేలు ఉండగా, నెంబరు కాయల ధర రూ.11 వేలు ఉంది. సమీప రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ లో కొబ్బరి దిగుబడి కొంతమేర తగ్గింది. దీంతోపాటూ ఉత్తరాది రాష్ట్రాల్లో కొబ్బరి పరిశ్రమలు వినియోగించే ఎండు కొబ్బరి ఇండోనేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి దిగుమతి తగ్గిన కారణంగా ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ పెరిగిందని పరిశీలకులు చెబుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి రాయలసీమ ప్రాంతానికి, తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాలతో పాటూ గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఇంకా పలు ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతులు అవుతున్నాయి. కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉండటంతో పాటూ, భవిష్యత్తులోనూ మార్కెట్ నిలకడగా ఉంటుందని అంచనాలు ఉండటంతో కొబ్బరి రైతులు కొబ్బరిసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

వార్డు, సచివాలయ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

సొంత మండలాల్లో బదిలీ తప్పనిసరి

ఏలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలో సచివాలయ, వార్డు ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధం అవుతోంది. ఐదేళ్ల పూర్తి చేసిన వారిని బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉత్తర్వులు సోమవారం రాత్రి వెలువడ్డాయి. దీంతో ఉమ్మడి జిల్లాల్లో 8 వేల మంది బదిలీలకు అవకాశం ఉంది. డేటాను సంబంధిత అధికారులు సేకరించి, రేషన్‌లైజేషన్ మోడ్‌లో జాబితాను 16 నుంచి 18వ తేదీల్లో తయారు చేస్తారు. రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు 22 నుంచి 24 వరకు గడువు ఇచ్చారు. 25 నుంచి 29వ తేదీలోగా జాబితాలను సరిచేసుకుని, రిక్వెస్ట్ దరఖాస్తులను పరిశీలించి ఐదేళ్లు పూర్తి చేసిన వారిని బదిలీ చేయనున్నారు. ఏమైనా అభ్యంతరాలు, విజ్ఞాపనలు కూడా ఈ నెలాఖరులోగా కలెక్టర్లు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో సొంత మండలాల్లో తిష్టవేసిన సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా వేరే మండలానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం సొంత మండలంలోనూ ఉద్యోగం చేసేందుకు వీల్లేకుండా మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకుని సమీప గ్రామాల్లో పనిచేస్తూ వచ్చిన ఉద్యోగుల కుర్చీలు ఖాళీ చేయాల్సి వస్తోంది. దూరం వెళ్లేందుకు ఇష్టంలేక చాలా మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పొరుగు మండలాల్లో పోస్టింగ్ పొందేందుకు సిఫార్సులు కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2019 అక్టోబర్ 2 నుంచి సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చిన విషయం తెల్సిందే. రెండేళ్లకో బదిలీ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఉద్యోగం పొందినప్పటి నుంచి ఒకేచోట పనిచేస్తూ వస్తున్నారు. గతేడాది సెప్టెంబర్లో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయ ఉద్యోగులకు ఐదేళ్లు నిండలేదు. రిక్వెస్టు పెట్టుకోవడానికి అవకాశమివ్వడంతో 15 నుంచి 20శాతం మాత్రమే బదిలీలు జరిగాయి. ఈసారి పెద్ద ఎత్తున బదిలీ కానున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఏడాది జైలు, జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి తీర్పునిచ్చారు. మచిలీపట్నానికి చెందిన మేకల శ్రీకాంత్ కుమార్‌కు చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన గంగుల నాగ మల్లేశ్వరరావు రూ.7 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చే నిమిత్తం శ్రీకాంత్ కుమార్ ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లలేదు. ఈ నేపథ్యంలో నాగమల్లేశ్వరరావు కోర్టును ఆశ్రయించగా కేసును విచారించగా శ్రీకాంత్ కుమార్‌కు ఏడాది జైలు, రూ.9లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

అనుచిత పోస్టులు పెడుతున్న వ్యక్తిపై ఫిర్యాదు



పోడూరు/ఆచంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న ఆచంటకు చెందిన భైరిశెట్టి ప్రవీణ్‌పై జనసేన పార్టీ నాయకులు పోలీసులకు సోమవారం ఆచంట, పోడూరులలో ఫిర్యాదుచేశారు. కూటమిలో గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తున్న ప్రవీణ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ మండల నాయకులు రావి హరిష్‌బాబు, తోటేటి వేణులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోడూరు, ఆచంట పోలీసు స్టేషన్లలో నాయకులు ఫిర్యాదు చేశారు. ఆచంట ఎస్ఐ కె.వెంకటరమణ మాట్లాడుతూ ప్రవీణ్‌పై జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు అందినట్టు తెలిపారు.

బాలికను గర్భవతిని చేసిన వ్యక్తికి యావజ్జీవం

భీమవరంక్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):బాలికను బెదిరించి అత్యాచారం జరిపి గర్భవతిని చేసిన వ్యక్తికి భీమవరం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. వీరవాసరం మండలం కొణితివాడకు చెందిన కండెల్లి రమేశ్ ఓ బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడంటూ 2020 జూలై 12న పోక్సో కేసు నమోదైంది. డీఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భీమవరం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు, వీరవాసరం ఎస్.ఐ. ఎం.రాజ్ కుమార్‌లు విచారణ చేపట్టి కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. దీంతో కండెల్లి రమేశ్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి లక్ష్మీనారాయణ తీర్పును వెల్లడించారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటరుగా బి.బ్రహ్మయ్య, డీవీ రామాంజనేయులు వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ పి.నానిబాబు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ సహాయ సహకారాలు అందించారు. ఈ కేసులో నిందుతుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి అభినందించారు.

75 ఏళ్ల భార్యను హతమార్చిన 85 ఏళ్ల భర్త







వివరాలు సేకరిస్తున్న పోలీసులు.. హత్యకు పాల్పడిన వృద్ధుడు లక్ష్మణరావు.. రంగమ్మ మృతదేహం

- స్వగ్రామానికి వెళ్లేందుకు నిరాకరించిందని కర్రతో దాడి
- దెబ్బలకు తాళలేక వృద్ధురాలు మృతి

ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి):ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.. ఆ ముగ్గురికీ వివాహాలు జరిపించారు. అయితే ఇద్దరు కుమార్తెలు వారి కుటుంబాలతో ఏలూరు శ్రీరామ్ నగర్ 9వ రోడ్డు ప్రాంతంలో ఒకేచోట ఉంటున్నారు. తల్లిదండ్రులైన బొబ్బా లక్ష్మణరావు (85), బొబ్బా రంగమ్మ(75) వారి స్వగ్రామమైన పెదపాడు మండలం రాజుపాలెంలోనే ఉంటున్నారు. అయితే వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను తమ వద్దకే తెచ్చుకుని వారి ఆలనాపాలనా చూసుకోవాలని అనుకున్న కుమార్తెలు కొన్నేళ్ల క్రితం వారిని ఏలూరుకు తీసుకొచ్చి శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని తల్లిదండ్రులను ఓ ఇంట్లో ఉంచి, కేర్ టేకర్‌ను ఏర్పాటు చేసి వారి బాగోగులు చూస్తున్నారు. ఆ వృద్ధ దంపతులిద్దరూ ఒంటరిగా ఉండడం, ఇతరులు ఎవరూ మాట్లాడడానికి అందుబాటులో లేకపోవడంతో మానసికంగా కుంగిపోయారు. ఏడాది క్రితం లక్ష్మణరావుకు ఎడమ కాలుకు కూడా కొంత భాగం తొలగించడంతో వీల్‌ఛైర్‌లోనే ఉంటూ కర్ర సాయంతో నడుస్తున్నాడు. మానసిక ఆందోళనకు గురవుతున్న లక్ష్మణరావు తన స్వగ్రామం రాజుపాలెం వెళ్లిపోదామని రంగమ్మతో చెప్తున్నాడు. తమ పిల్లలు అంతా ఇక్కడే ఉన్నారని అక్కడకు వెళ్ళి ఏమి చేద్దామంటూ ప్రశ్నించి ఆమె వెళ్ళడానికి నిరాకరించింది. దీంతో ఈ నెల 15వ తేదీన వారిద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె తన భర్తపై అలిగి కుమార్తెల వద్దకు వెళ్లడానికి ప్రయత్నించింది. అయితే లిఫ్టులో ఎలా వెళ్ళాలో తెలియక రాత్రి వరకూ ఉండి తిరిగి భర్త వద్దకే వచ్చింది. దీంతో ఇద్దరి మధ్యా ఘర్షణ జరిగింది. అనంతరం ఏం జరిగిందో కాని సోమవారం వేకువజామున తన చేతి కర్రతో లక్ష్మణరావు భార్య రంగమ్మ చేతిపై కొట్టడంతో ఆమె చేయి విరిగిపోయి కిందపడిపోవడంతో ఆమెపై తీవ్రంగా దాడి చేశాడు. ఆమె మరణించిందో బ్రతికుందో తెలియని పరిస్థితి... సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో సాయంత్రం పోలీసులకు సమాచారం అందింది. దీంతో లక్ష్మణరావు కుమార్తె పైడి విజయలక్ష్మి(50) ఫిర్యాదుతో త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, వారి సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి వివరాలడిగి తెలుసుకున్నారు. మరోవైపు లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్య కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొబ్బరి చెట్టు కట్ చేస్తుండగా ఒకరి మృతి



ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టును మిషన్‌తో కోసి ముక్కలను కిందకు దించే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దెందులూరు మండలం గాలాయిగూడేనికి చెందిన యడ్ల రాటాలు(50) కొబ్బరి చెట్లను మిషన్‌తో కోసి తొలగించే పనికి పెదవేగి మండలం విజయరాయి వెళ్లాడు. అక్కడ ఒక రైతు పొలంలో కొబ్బరిచెట్లను మిషన్‌తో చెట్టును చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి వాటిని కిందికి వేస్తున్నారు. ఈక్రమంలో యడ్ల రాటాలు కొబ్బరి చెట్టు ఎక్కి మిషన్‌తో కొబ్బరిచెట్టును కోసి ముక్కలు వేసే క్రమంలో అతనిమీదే పడింది. దీంతో తీవ్ర గాయపడటంతో తోటి కూలీలు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ప్రేమలో పడి మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య!

ఆచంట, జూన్ 16(ఆంధ్రజ్యోతి):గుర్తు తెలియని యువతితో ప్రేమలో పడి మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కరుగోరుమిల్లి శివారు కడలివారిపాలెంలో చోటు చేసుకుంది. కడలి హరీశ్(25) పాలకొల్లు సాయి ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్లి అక్కడే ఉంటూ వారం రోజుల అనంతరం మరలా ఆదివారం ఉదయం ఇంటికి వస్తుంటాడు. గత ఆదివారం రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో ఈ నెల 15న రాత్రి 9.30 గంటల సమయంలో కాంపాటి నాగరాజు అనే వ్యక్తి ఫోన్ చేసి మీ అబ్బాయి ఇక్కడ మృతి చెందిపడిఉన్నాడని చెప్పడంతో అంతా నిర్ఘాంతపోయారు. కరుగోరుమిల్లి ఏటిగట్టు రోడ్డు పంట కాల్వ వద్దకు వెళ్లి చూడగా హరీశ్ మృతిచెందిపడిఉన్నాడు. తండ్రి కడలి వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంత కాలంగా గుర్తుతెలియని యువతితో ప్రేమలో పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెట్టింపు సొమ్ము ఇస్తామంటూ ఆశ చూపి మోసం

ముఠాను అరెస్ట్ చేసిన తాడేపల్లిగూడెం పోలీసులు

నలుగురి నుంచి రూ.4.20 లక్షలు స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మీరిచ్చే సొమ్ముకు రెట్టింపు డబ్బు వచ్చే మంచి డీల్ ఉంది.. రూ.500 నోట్లకు రూ.వంద నోట్లతో లక్ష ఇస్తే రెండు లక్షలు వస్తుందని ఓ ముఠా నమ్మించి లక్షల్లో మోసం చేసిన కేసును తాడేపల్లిగూడెం పోలీసులు ఛేదించారు. సోమవారం నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ డి.విశ్వనాథ్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తెలంగాణలోని సూర్యాపేట మండలం పికులనాయక తండాకు చెందిన సోదా సోతు సాయికిరణ్, నాగరాజు సింహాద్రి మోహనరావులు స్నేహితులు. భీమడోలుకు చెందిన ఆర్కేరెడ్డి అనే ఆనంద్‌కు వీరితో పరిచయం ఉంది. దీంతో తన స్నేహితుడు సత్తిబాబు దగ్గర మంచి డీల్ ఉంది మన దగ్గర రూ.500 ఇస్తే దానికి రెట్టింపు నగదు రూ.100, 200 నోట్లు ఇస్తారని నమ్మించాడు. సాయికిరణ్, మోహనరావులు ఆశపడి సొమ్ము రెట్టింపు అవుతుందని భావించి రూ.5 లక్షల వరకూ ఈ నెల 13న తాడేపల్లిగూడెం తీసుకొచ్చారు. తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్దకు వచ్చిన వారిని సత్తిబాబు, ఆనంద్‌లు కారులో ఎక్కించుకున్నారు. వెంట తెచ్చిన సొమ్ము చూపించాలని ఆనంద్ కోరగా సాయికిరణ్ తన బ్యాగ్‌లో ఉన్న డబ్బు బయటకు తీసి చూపించారు. ఈ విషయాన్ని కారుబయట నక్కి గమనిస్తున్న షేక్ సుభాని, పిల్లిబోయిన గణేశ్‌లు కారులోకి వచ్చి సాయికిరణ్, మోహనరావులను బెదిరించి వారి వద్ద ఉన్న సొమ్ముతో ఉడాయించారు. దీనిపై 15న తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పట్టణ సీఐ ఆది ప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు బాలం శ్రీనివాస్, నాగరాజులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు చేశారు. ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించి పోడూరు మండలం జున్నూరుకు చెందిన నక్కా సత్తిబాబు, భీమడోలు మండలం పాత అంబరుపేటకు చెందిన ఆనంద్, తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటకు చెందిన షేక్ సుభాని, జంగారెడ్డిగూడెంలోని రామచంద్రాపురానికి చెందిన పిల్లిబోయిన గణేష్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4.20, నగదు, కత్తి, బ్లేడుతో పాటు సూట్‌కేసు, క్యాష్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం, డీఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

మాట చెల్లింది.. మొక్కుతీరింది

ఏలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఈ ఏడాది విద్యా ర్థుల అడ్మిషన్లు జరగాలని పట్టుబట్టి మరీ మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ ఎట్టకేలకు సాధించారు. గత కొన్ని వారాలుగా మంత్రి పార్థసారథి దగ్గర్నుంచి ఉన్నత స్థాయిలో ఈ కళాశాలలో అడ్మిషన్లు జరిగి తీరాలని ఘంటా మురళీ డిమాండ్ చేస్తూ వచ్చారు. సోమ వారం నుంచి కళాశాలలో అడ్మిషన్లను ఇంటర్‌బోర్డు అధికారులు దగ్గరుండి ఆరంభించారు. ఈ నేపథ్యంలో ద్వారకాతిరుమలలో చినవెంకన్నకు మొక్కులు చెల్లించారు.

5న జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి, జూన్ 16(ఆంధ్రజ్యోతి):లోక్ అదాలత్‌ను జూలై 5న నిర్వహిస్తున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు తెలిపారు. సోమ వారం కోర్టు ఆవరణలో న్యాయవాదులకు అవగాహన కల్పించారు. పెండింగ్ కేసులు పరిష్కారానికి లోక్ అదాలత్ సరైన మార్గమన్నారు. సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, మనోవర్తి వంటి రాజీ పడతగ్గ కేసులు పరిష్కారం చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మాణిక్యాలరావు, న్యాయవాదులు పాల్గొని మాట్లాడుతూ ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్యే మద్దిపాటికి మంత్రి లోకేశ్ ఆత్మీయ పలకరింపు



ద్వారకాతిరుమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 21న జరగనున్న ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు రానున్న సందర్భంగా సభా ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన మంత్రి లోకేశ్ ఎమ్మెల్యే మద్దిపాటిని ఆత్మీయంగా పలకరించారు. నియోజకవర్గ అభివృద్ధికి మద్దిపాటి చేస్తున్న కృషిని ప్రశంసించారు. సహాయ సహకారాలకు తాను వెన్నంటే ఉంటానని మంత్రి లోకేశ్ చెప్పినట్లు ఎమ్మెల్యే మద్దిపాటి తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన శాప్ డైరెక్టర్ జగదీశ్వరి



జీలుగుమిల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్)లో పోలవరం మండలం సింగన్నపల్లికి చెందిన కొవ్వాసి జగదీశ్వరిని డైరెక్టరుగా నియమించారు. దీంతో ఎమ్మెల్యే ఎమ్మెల్యే చిర్రి బాలరాజును ఆమె బర్రింకలపాడు క్యాంపు కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదీశ్వరిని సన్మానించారు. శాప్ డైరెక్టరు పదవి నియోజకవర్గానికి దక్కడం పట్ల ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేసి ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఎస్టీసెల్ ఉపాధ్యక్షులు విజయ్‌నాయక్ ఉన్నారు.

విద్యార్థులకు చెక్కుల అందజేత : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న విద్యార్థులకు ఎమ్మెల్యే తన వంతుగా వారికి ప్రోత్సాహక బహుమతిగా మండలానికి చెందిన కలపర్తి సాయి,షేక్ సమీరా చెక్కులు అందజేశారు. విద్యార్థుల్ని అభినందించి భవిష్యత్తులో విద్యలో మరింత రాణించాలన్నారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

తూర్పుయడవల్లిలో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



కామవరపుకోట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తూర్పుయడవల్లిలో శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో 11వ తేదీ నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ మేరకు ఆలయంలో చతుష్టానార్చన, నిత్యహవనం, మహాపూర్ణాహుతి, పంచవింశంతి, కలశ స్నపనం అనంతరం ద్వాదశారాధన, శ్రీ పుష్ప యాగం, దేవతోద్వాసన, సప్తావర్ణ ప్రదక్షణ, ధ్వజారోహణ, ధ్వజపట ఉద్వాసన, కుంభ ప్రోక్షణ, క్షమాప్రార్ధన, నివేదన, మహా మంగళ శాసనం, రుత్విక్ సన్మానం, యజమానుల ఆశీర్వచనలతో ఉత్సవ పరిసమాప్తి జరిగాయని ఆలయ ప్రధాన అర్చకులు అళహరి శేషాచార్యులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు.

అభివృద్ధి దిశగా కో-ఆపరేటివ్ బ్యాంకు : డైరెక్టర్

ఏలూరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైనసేవలందిస్తూ ది.ఏలూరు కో-ఆపరేటివ్ బ్యాంక్ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని ఆ బ్యాంక్ డైరెక్టర్ బి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. బ్యాంకు మహాజన సభ ఏలూరు వై.ఎం.హెచ్.ఎ హాల్లో జరిగింది. సమావేశంలో బ్యాంకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పరిపాలనా, అక్కౌంట్, ఆర్థిక నివేదికను ఆమోదించారు. ఈ ఏడాది ఆర్జించిన నికరలాభాన్ని బడ్జెట్‌కు మించి ఖర్చులు ఆమోదించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లలో అభివృద్ధిని సాధించిందన్నారు. పి.నాగభూషణ్‌రావు, వి.మారుతీ వరప్రసాద్, కె.రమేశ్ బాబు, సి.హెచ్.ఆంజనేయస్వామి, ఎస్.కె. సాబీర్ హుస్సేన్, బి.వెంకటరామారావు, వి.గంగసరళ, బ్యాంకు సీఈవో అచ్యుతరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా నివేదిక ఇవ్వాలి

బుట్టాయగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం ద్వారా అందిస్తున్న పథకాలను అర్హులైన కొండరెడ్లు అందరికీ అందేలా అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ పి.వి.చలపతి రావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని ముంజులూరు, కన్నారప్పాడు కొండరెడ్డి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. సభల్లో కేంద్రం నుంచి పీటీసీలకు అందించే పథకాలను వివరించడమేకాకుండా వాటిపై అవగాహన కల్పించారు. యూనిట్ల అవసరాలను తెలుసుకుని అధికారులు నివేదికలు అందజేయాలన్నారు. అనంతరం కొండరెడ్లకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

హేలాపురి లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఏలూరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు హేలాపూరి లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. క్లబ్ అధ్యక్షులు పీవీ.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ లయన్స్ అవార్డు గ్రహిత బాలకృష్ణ నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షులుగా బీవీవీ సత్యనారాయణ, సెక్రటరీగా దుశ్యంత్ చౌదరి, కోశాధికారిగా కె.సత్యనారాయణ, ఎన్నికయ్యారు. డాక్టర్ డీ.సుబ్బారావు, ఎల్.వెంకటేశ్వరరావు, టి.విజయశ్రీ, వి.సత్యస్వరూప్, శ్రీనివాస్, డి.హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికసిత్ భారత సుపరిపాలన సభ

కామవరపుకోట, జూన్ 16(ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారతదేశపు అమృతకాలం-సేవా సుపరిపాలన సభను ఏర్పాటు చేశారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్ల గడిచిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ, బీజేపీ మండలాధ్యక్షులు రాజు, జిల్లా అధ్యక్షులు చవటపల్లి విక్రమ్ కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురెళ్ళ సుధాకర్ కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.వి. రామలక్ష్మి, ఉపాధ్యక్షులు వేమూరి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ ఒంటెద్దు యేసు వరప్రసాద్ పాల్గొని వికసిత భారత్ లక్ష్యసాధన ప్రతిజ్ఞ చేశారు.


ప్రత్తికోళ్లలంకలో సంకల్పయాత్ర..

ఏలూరురూరల్ : పేదలందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరాలన్నదే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్యమని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సుధాకర్ కృష్ణ అన్నారు. ప్రత్తికోళ్ల లంకలో వికసిత్ భారత్ సంకల్పసభ నిర్వహించారు. కోటప్రోలు కృష్ణ, గుమ్మడి వెంకటచైతన్య కృష్ణ, సైదు సువర్ణరాజు, డాక్టర్ చౌదరి, సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు పని కల్పించాలి

కామవరపుకోట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ ఏడాదికి 200 రోజులు పని కల్పించి రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కరేటి నర్సింహులు, సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రత్నగిరినగర్‌లో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. కార్మిక సంఘం ప్రతినిధులు బేరం వీరరామవులు, కొత్తపల్లి, కృష్ణ, అబ్బూరి వెంకటరత్నం, లెక్కలపు శ్రీలక్ష్మి, షేక్ ఖాసింబీ, ధూళిపాళ్ళ లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో చైతన్యానికి అవార్డులు దోహదం



పెదవేగి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అవార్డులు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చి, వారిలో చైతన్యం నింపుతాయని ఎస్ఎంసీ హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్.అవినాశ్‌రాజు అన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో పెదవేగిలోని ఎస్ఎంసీ హై స్కూల్ విద్యార్థులు ముగ్గురు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నారు. పెదవేగి మండలంలో మొత్తం ఏడుగురు విద్యార్థులను ఈ అవార్డులు వరించగా, అందులో ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. కాగా ఎస్ఎంసీ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న తాతా జాహ్నవి, బొల్లా జస్వంత్, కె. హాసినిలను శాలువాతో సత్కరించి, రూ.వేలు నగదును ప్రోత్సాహకంగా అందించారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి



రామన్నగూడెంలో స్థానిక నాయకులు..



సంతపాకలలో ఘంటా మురళి...



చింతలపూడిలో విద్యార్థులు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

తల్లికి వందనం సంబరాలు

ఏలూరుటూటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): తల్లికివందనం పథకంలో తల్లుల ఖాతాలో నగదు జమకావడం పట్ల ప్రతీ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. సూపర్ 6 పథకాల అమలులో భాగంగా తల్లికివందనం చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల మంది తల్లుల ఖాతాలో 8745కోట్లు జమకావడం చారిత్రాత్మకమన్నారు. ఇంట్లో ఎంత మంది చదువుకునే వారున్న రూ.13వేల చొప్పున అకౌంట్‌లో వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేశామన్నారు.

● కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం అమలు చేసినట్టు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం సంతపాకల సమీపంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ ఆధ్వర్యంలో తల్లికి వందనం అమలు వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.కామవరపుకోట హైస్కూల్ వద్ద వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి వేడుకను జరిపారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాన్, లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కూటమి నాయకులు ఏలూరి హరిరామకృష్ణ, కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్ బాబు, నెక్కలపు సూర్యనారాయణ, నెక్కలపు గంగాధర రావు, ఎస్ఎంసి ఛైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్, నూతి రాటాలు, పండు జగదీశ్ పాల్గొన్నారు.

● చింతలపూడి: జడ్పీ పాఠశాలలో, సుబ్బరాజు ప్రభుత్వ హైస్కూల్లో టీడీపీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షులు తాటి అప్పారావు మాట్లాడుతూ పాఠశాల విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు విద్యాశాఖా మంత్రి లోకేశ్ అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా తల్లికి వందనం అమలు చేశారన్నారు. మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, సిరిమిల్లి రామారావు, సత్యకుమార్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: తల్లికి వందనం పథకం అమలు విజయవంతం కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు మండలంలోని రామన్నగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే మద్దిపాటి చిత్రపటాలకు లబ్ధిదారులైన విద్యార్థుల తల్లులు, టిడిపి నేతలు పాలాభిషేకం చేశారు. మద్రాస్ రాము, కమ్మ సత్యనారాయణ, కుక్కల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● ఏలూరుటూటౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ప్రణాళికబద్ధంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సోమవారం 49వ డివిజన్‌లోని 3, 4 సచివాలయాల పరిధిలో ప్రజలను కలుసుకుని తల్లికి వందనం రాని వారిని వివరాలడిగి తెలుసుకున్నారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల తల్లికి వందనం నగదు కొంతమందికి పడలేదన్నారు. ఆ ఇబ్బందులు తొలగించేందుకు సచివాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు, బొద్దాని శ్రీనివాస్, నెరుసు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరి

పోలవరం జూన్ 16(ఆంధ్రజ్యోతి): రైతులు విధిగా ఈకెవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు సూచించారు. సోమవారం ఆయన ఈ మేరకు మాట్లాడుతూ పోలవరం మండలానికి సంబంధించి 5,161 మంది రైతుల జాబితాను ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద ఏర్పాటు చేశామని, ఈకెవైసీ పూర్తి చేసిన రైతులు మాత్రమే అన్నదాత సుఖీభవ సొమ్ములు పొందడానికి అర్హులన్నారు. రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రం లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఈకెవైసీలకు ఈనెల 18 లోగా కంప్లీట్ చేయాలని సూచించారు.

● చింతలపూడి: ప్రభుత్వం రైతులకు బాసటగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు బి.నాగకుమార్ తెలిపారు. అర్హత ఉన్న రైతుల జాబితా ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు.

● జీలుగుమిల్లి: అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిపొందేందుకు రైతులు ఇకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కాళింగ గంగాధరం అన్నారు. ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదని తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ఇకేవైసీ వేయాలన్నారు. అర్హుల జాబితా ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద ఉందన్నారు. ఈకేవైసీ వేలిముద్ర వేసిన వారు మాత్రమే పథకానికి అర్హులన్నారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

జంగారెడ్డిగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యామిత్ర కిట్లు పేదవిద్యార్థులకు వరమని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అన్నారు. జంగారెడ్డిగూడెం జడ్పీ బాయ్స్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్ అధ్యక్షతన జరిగిన విద్యామిత్ర కిట్లు పంపిణీలో ఎంఈవో-2 శ్రీరాములు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాకిట్లలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, మొదలైనవి అందిస్తున్నామని అన్నారు. నందమూరి రామచంద్రరాజు, సత్యనారాయణ, రావూరి కృష్ణ, రమదేవి, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసించి ఉన్నతశిఖరాలు అధిరోహించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కేతవరం, వెలగపాడు, గ్రామపంచాయతీల్లో ఉన్న పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, సోమవారం పంపిణీ చేశారు. వెలగపాడు సర్పంచ్ జలపాలు, మావిళ్ల అర్జునరావు, రామకృష్ణ, వెలగపాడు ఎస్ఎంసీ ఛైర్మన్ గంటా బుజ్జిబాబు, జయవరపు వెంకటేశ్వరరావు, కేతవరం ఉపసర్పంచ్ భీమవరపు జగన్మోహనరావు, జయవరపు శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులు, ఆర్టిస్టులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసడాంగే

ఏలూరుకార్పొరేషన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పేయింటింగ్ కార్మికులను, ఆర్టిస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఆర్ పేటలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పేయింటింగ్ కార్మికుల సర్వసభ్య సమావేశానికి కేదారి వంశీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాంగే మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది పేయింటర్స్, ఆర్టిస్టులు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి ఆ బోర్డు సంక్షేమ నిధి నుంచి పేయింటర్స్, ఆర్టిస్టులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు.ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పళ్ళెం కిషోర్, భజంత్రి శ్రీనివాస్, ఎ.అప్పలరాజు, పి.అజిత్‌కుమార్, వి.శ్రీనివాస్, మహ్మద్ జానీ, వెంపటాపు రామకృష్ణ, పిల్లి రమేష్, బి.కోట సత్యనారాయణ, మేడిశెట్టి అప్పారావులను ఎఐటీయుసి పేయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీగా ఎంపిక చేసి గౌరవ అధ్యక్షులుగా రెడ్డి శ్రీనివాసడాంగే వ్యవహరిస్తారని ప్రకటించారు.

నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం : ఎస్పీ

జంగారెడ్డిగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానం సమర్థవంతంగా వినియోగిస్తున్నామని ఎస్పీ కేపీఎస్ కిషోర్ చెప్పారు. జంగారెడ్డిగూడెంలో సీసీ కెమెరా వ్యవస్థను సోమవారం ఎస్పీ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మత్తుపదార్థాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రత్యేక అవగాహన కల్పిస్తూ ప్రత్యేక చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో ఇతర రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్ల నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో షెల్టర్ జోన్ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పోలవరం నిర్మాణ ప్రాంతంలో భద్రను కఠినంగా అమలు చేస్తున్నామని చెప్పారు. చోరీ కేసులలో విజయవంతమైన విచారణ బాధితులకు చోరీ సొత్తును అప్పగిస్తున్నామని చెప్పారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన చోరీ కేసులను ఛేదించి చోరీకి గురైన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసొత్తును ఎస్పీ స్వయంగా బాధితులకు అప్పగించారు. దీంతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల గదుల ప్రారంభం

టి.నర్సాపురం, జూన్16(ఆంధ్రజ్యోతి): తిరుమలదేవిపేట ప్రాథమికొన్నత పాఠశాలను జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయిన సందర్భంగా అవసరమైన పాఠశాల ఐదు అదనపు గదులు కీర్తిశేషులు తోట సుబ్బారావుగారి జ్ఞాపకార్థం వారి కుమారులు టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ నిర్మాణం చేసి ఆ గదులను సోమవారం ప్రారంభ పూజ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతలు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మాణం చేసిన తోట లక్ష్మీ నారాయణను ఆయన అభినందించారు.

భూ వివాదంతో ఎంపీకి సంబంధం లేదు

కొయ్యలగూడెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెంలో జరుగుతున్న భూవివాదం పై ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు ఏ విధమైన సంబంధంలేదని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ సర్వే నెంబర్లలో జరిగిన పలు అవకతవకలపై ఎంపీ పుట్టా మహేశ్‌పై పలు ఆరోపణలు వచ్చాయని, ఇందులో ఏ మాత్రం నిజంలేదన్నారు. దీనిపై ఇరువర్గాలు కేసులు పెట్టుకున్నారని దీని వెనుక ఎంపీ పుట్టా మహేశ్ ఉన్నారని ఆరోపణలు రావడంతో తాము ఖండిస్తున్నామన్నారు. త్వరలోనే ఎంపీ కొయ్యలగూడెం పట్టణం వచ్చిన బాధితులకు న్యాయం చేస్తారని తెలిపారు.

21న అన్ని సచివాలయాల్లో యోగా నిర్వహించాలి



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న ఎంపీడీవో

పెదవేగి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యోగా ఆరోగ్యానికి ఒక దివ్యమైన ప్రక్రియ అని, దీనిని ఆవశ్యకతను గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న అన్ని సచివాలయాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి సంబంధించి పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సోమవారం నిర్వహించిన సమావేశంలో యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ప్రజల దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకుంటే వారికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు వివరించి, యోగావైపు మళ్లేలా చూడాలని చెప్పారు. ఈవో పీఆర్డీ షరీఫ్, కార్యదర్శులు కృష్ణంరాజు, సాయికృష్ణ, విజయ్, నిర్మల, సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి

లింగపాలెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ అబీదా అన్నారు. మండలంలోని కె.గోకవరంలో పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎవరికైనా రెండ్రోజులకు మించి జ్వరం వస్తే స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

యోగా డే పరిశీలకుడిగా గన్ని

భీమడోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విశాఖ ఆర్‌కే బీచ్‌లో ఈనెల 21న జరగనున్న యోగా డే విశాఖ సౌత్ నియోజకవర్గ పరిశీలకుడిగా గన్ని వీరాంజనేయుల్ని నియమించారు. ఈమేరకు సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు నిర్వహించిన సమీక్షలో గన్ని పాల్గొన్నారు.

ఇంట్లో మందలించారని వ్యక్తి ఆత్మహత్య

కుక్కునూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించారని పాయం జగదీశ్(29) అనే యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చెరువుకొమ్ముగూడెం గ్రామానికి చెందిన పాయం జగదీశ్ మద్యానికి బానిసవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. జగదీశ్‌కు భార్య, పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. రామకృష్ణ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

ఏలూరు క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు జీతాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద కార్మికులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలో ఉన్న ఆస్పత్రుల్లో పని చేస్తున్న శానిటరీ సిబ్బందికి ఫస్ట్ ఆబెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టరు 5 నెలలు జీతాల బకాయిలు చెల్లించాలని, పీఎఫ్ 10 నెలల బకాయిలు చెల్లించాలన్నారు. అధికారులకు నోటీసులు ఇచ్చి ధర్నా చేశారు. జిల్లాలోని జనరల్ హాస్పిటల్, ఏరియా ఆసుపత్రి జంగారెడ్డిగూడెం, చింతలపూడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్, దెందులూరు, భీమడోలు, పోలవరంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.




ఆందోళన నిర్వహిస్తున్న శ్రీనివాస్, కాలనీ వాసులు

పేదల ఇళ్లస్థలాల్లో పోలీస్ స్టేషన్ వద్దు

ఏలూరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండవల్లి శివారు తరుగుమూల లేఅవుట్‌లో పేదలకిచ్చిన ఇందిరమ్మ కాలనీ ఇళ్లస్థలాన్ని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించడం సరికాదని కాలనీ వాసులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం ఇళ్లు లేని 131 మందిని గుర్తించి ఇచ్చారని అన్నారు.

కాలనీ వాసుల వినతిపై జేసీ అసహనం

ఈ నేపథ్యంలో మీకోసంలో వినతిపత్రం అందజేయగా పోలీస్ స్టేషన్ వద్దా, బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా అంటూ జేసీ ధాత్రి రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పట్టాలుంటే చూపించాలని, అర్హులైతే వేరేచోట స్థలాలిస్తామంటూ జేసీ మాట్లాడటంతో లబ్ధిదారులు అవాక్కయ్యారు. కోట జయ, ముక్కు అలివేలు మంగమ్మ, చింతామణి, వెంకటేశ్వరమ్మ, మాణిక్యం, పద్మ, కనకదుర్గ, ప్రసన్న, సుజాత పాల్గొన్నారు.



దర్మాజీగూడెంలో పాడైన వాటర్ ప్లాంట్

ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయాలి

లింగపాలెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెం పాఠశాలలోని ఆర్వో ప్లాంట్(నీటిశుద్ధి యంత్రం)మరమ్మతులకు గురైంది. చాలావరకు పలు పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్‌లు పాడవడంతో నిరుపయోగంగా మారాయి. వాటిలో కొన్నింటిని బిగించగా మరికొన్ని బిగించకపోవడంతో వృథాగా మారాయి. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైతే సదరు యాప్‌లో నమోదు చేస్తే కాంట్రాక్టర్లే బాగుచేయాల్సి ఉంటుంది. అయితే వాటిని పట్టించుకోకపోవడంతో వృథాగాపడి ఉన్నాయి. మధ్యాహ్న భోజనం సమయంలో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వ్యవసాయాధికారిగా ప్రదీప్ కుమార్

లింగపాలెం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారిగా నియామకమైన వి.ప్రదీప్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించేలా కృషి చేస్తానని రైతులకు అందుబాటులో ఉంటానని రైతులకు వ్యవసాయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పరిష్కరించేలా చూస్తానన్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ, ఈకేవైసీలను త్వరగతిన పూర్తి చేయాలన్నారు. కాగా ఆయన పెదపాడు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

27న ఫెర్రీ రేవు బహిరంగ వేలం

పోలవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోలవరం- పురుషోత్తపట్నం ఫెర్రీ రేవు 2025-26 సంవత్సరానికి బహిరంగ వేలం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు సోమవారం తెలిపారు.సీల్డు టెండర్లు ఈ నెల 27న మధ్యాహ్నం ఒంటిగంట లోపు కార్యాలయం పనివేళలో పోలవరం మండల పరిషత్ టెండరు బాక్సులో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు సీల్డు టెండరు కవర్లు తెరవడం జరుగుతుందన్నారు. రూ.11లక్షల 50వేల రూపాయలతో పాట ప్రారంభమవుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు 18 లక్షల రూపాయల సాల్వెన్సీతో సంబంధిత వివరాలకు కార్యాలయ పని వేళలో సంప్రదించాలని కోరారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఐటిఐ/డీఎల్‌టీసీలో ఈ నెల 18న క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. జాబ్ ఫెయిర్‌కు 15 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. ఐటిఐ పూర్తిచేసిన విద్యార్థులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాబ్ ఫెయిర్‌కు హాజరుకావచ్చన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరుకావాలని కోరారు.

తపస్య జూనియర్ కళాశాలకు అనుమతులు లేవు : ఆర్ఐవో

ఏలూరు అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోటలోని తపస్య జూనియర్ కళాశాలకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి (2025-26)సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపుగాని, అనుమతులుగాని లేవని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఈ కళాశాలలో విద్యార్థులెవ్వరూ చేరరాదన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎల్టీఆర్ భూములకు పట్టాలివ్వాలి

పోలవరం జూన్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సాగులో ఉన్న ఎల్టీఆర్ భూములకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దారు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్ళ నుండి గిరిజనుల సాగులో ఉన్న 1/70 చట్ట భూములను సాగు రికార్డుల్లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు బొరగం భూచంద్రం, టి.శాంతికుమారి, జి.పాండవులు, డి.లక్ష్మి, కె.రాజు, డి సుబ్బాయమ్మ, ఎం.గంగాదేవి పాల్గొన్నారు.



గూటాల నుంచి నీటి విడుదల

పోలవరం, జూన్16(ఆంధ్రజ్యోతి) :పట్టిసీమ కొత్తపట్టిసీమ గూటాల గ్రామాల ఆయకట్టు రైతుల సాగునీటి అవసరాలకు గూటాల పంపింగ్ స్కీం నుంచి నీటిని విడుదల చేసినట్లు నీటి సంఘం అధ్యక్షులు కరిబండి శ్రీనివాస్ సోమవారం తెలిపారు. నీటి సంఘం నిర్వహణ ఖర్చులు లావాదేవీల వివరాలు ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి చర్చించామన్నారు. ఖరీఫ్ సీజను ఆకుమడులు ఇతర అవసరాల కోసం గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉన్న నేపథ్యంలో గత రెండు రోజుల నుండి ఒక మోటారు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రజకుల ఇబ్బందులు పరిష్కరించాలి

ఏలూరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రజకుల వృత్తి చెరువులు ఆక్రమణలకు గురై రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా సర్వేయర్లతో సమగ్ర సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించాలని జిల్లా రజక జనసంఘ అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య కోరారు. సోమవారం ఏలూరులో జిల్లా రజక సంఘ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అనేక మండలాలో రజక చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దేవులపల్లి రజకసంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. నూతన అధ్యక్షులుగా లింగాల గంగరాజు, ఉపాధ్యక్షులుగా తాతూరు నాగవెంకటరావు, కార్యదర్శి లింగాల నాగు ఎన్నికయ్యారు. జిల్లా రజకసంఘం నేతలు మురళీ, లక్ష్మీప్రసన్న, శ్రీనివాస్, సుబ్బయ్య పాల్గొన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన ఒకరికి జైలు

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నానికి చెందిన మేకల శ్రీకాంత్ కుమార్‌కు చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన గంగుల నాగమల్లేశ్వర రావు రూ. 7 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చే నిమిత్తం శ్రీకాంత్‌కుమార్ ఇచ్చిన చెక్కు అతని ఖాతాలో నగదు లేదని తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలో నాగ మల్లేశ్వరరావు కోర్టును ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి నిందితుడు శ్రీకాంత్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష, రూ. తొమ్మిది లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హుండీ సొమ్ము చోరీ

కలిదిండి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆరుతెగలపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో దుండగులు ఆదివారం రాత్రి హుండీని పగులగొట్టి సుమారు రూ.2 వేలు నగదును అపహరించారు. పగటి పూట దొంగలు ఆలయాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి వేళ చోరీకి పాల్పడుతున్నారని ఆలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ వెంకటేశ్వర రావు తెలిపారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఐదేళ్లలో అక్రమంగా 25 కేసులు పెట్టారు

వాయిదాలకు ప్రజాప్రతినిధుల కోర్టుకు మంత్రి నిమ్మల



విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద మంత్రి

పాలకొల్లు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో తనపై అక్రమంగా 25 కేసులు బనాయించారని మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు తెలిపారు. వాయిదాలకు హాజరవుతున్నానని, ఈ నెల 23 నాటికి మరలా వాయిదా కేసు వేసినట్టు తెలిపారు. 2019 ఆగస్టులో వైసీపీ ప్రభు త్వం ఆశా వర్కర్లను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు వారికి న్యాయపరంగా అండగా నిలిచినందున ఆనాడు తనపై అక్రమ కేసు పెట్టారన్నారు. నాటి నుంచి నేటి వరకూ ఐదేళ్ళుగా విజయ వాడలోని ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరవుతున్నానని వివరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లా డుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, రెడ్ బుక్ గురించి వైసీపీ నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. 2014లో తొలిసారిగా, 2019లో రెండోసారి నాపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా లేదని మూడో సారి 2024లో మాత్రం 5 ఏళ్లలో 25 కేసులు నమోదు అయినట్టు అఫిడవిట్ దాఖలు చేయాల్సి వచ్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ఐదేళ్ల కక్షపూరి తంగా కేసులు పెట్టి వేధించారని అన్నారు. మంత్రి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, ధనాని ప్రకాష్ తదితరులు ఉన్నారు.



మోదీ పాలనలో దేశం సుసంపన్నం

చాట్రాయి సంకల్ప సభలో జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్

చాట్రాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సారథ్యంలోని దేశం సుసంపన్నం అవుతున్నదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ కిశోర్ అన్నారు. చాట్రాయి పార్టీ కార్యాలయంలో సోమవారం మోదీ 11 ఏళ్ళ పాలనలో సాధించిన విజయాలపై సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ 2014లో ప్రపంచంలో 10వ స్థానంలో ఉన్న భారత్ 2025 నాటికి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఎల్‌వోసీ వెంట 9 ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం చేశామని ఇది మన సైనిక శక్తికి నిదర్శనం అన్నారు. దేశంలో 54,917 కిలో మీటర్లు, రాష్ట్రంలో 4,551 కిలో మీటర్లు కొత్తగా జాతీయ రహదారులు నిర్మించబడ్డాయని, ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద దేశంలో 4 కోట్లు, రాష్ట్రంలో 23.5 లక్షల ఇళ్ళు నిర్మితమయ్యాయని, హర్ ఘర్ జల్ యోజన పథకం కింద దేశంలో 15 కోట్లకు పైగా ఇళ్లకు, రాష్ట్రంలో 39.84 లక్షల ఇళ్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశారన్నారు. పార్టీ మండల అధ్యక్షు డు ఓబిళ్ళనేని రాజా అధ్యక్షతన జరిగిన సభలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు చక్రధరరావు, నియోజకవర్గ నాయకులు రంగారావు, బోను అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, నాయకులు సంజీవరెడ్డి, ముత్తారెడ్డి, శ్రీకర్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలి

చాట్రాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అన్నదాతా సుఖీభవ పథకం కోసం రైతులంతా 20వ తేదీ లోగా తప్పనిసరిగా ఆర్ఎస్‌కేలకు వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో శివశంకర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలో చాట్రాయి, జనార్ధనవరం, ఆరుగొలనుపేట రైతు సేవా కేంద్రాలను ఏవో సందర్శించి ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు త్వరలో అన్నదాతా సుఖీభవ పథకం మొదటి విడత రూ. 5 వేలు, పీఎం కిసాన్ రూ. 2 వేలు బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని అన్నారు. మండలంలోని కౌలు రైతులు వీఆర్వో, వీఏవోలను సంప్రదించి ఖరీఫ్ సీజన్‌కు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని కోరారు.

యోగాతో మానసిక దృఢత్వం

చాట్రాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025లో భాగంగా మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో సోమవారం యోగా టీచర్ కృష్ణవేణి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వలన మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందని, తద్వారా చదువుల్లో, జీవితంలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ హసీనా, సీఆర్పీ రమేష్, హెచ్ఎం వెంటరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



మొక్క నాటినప్పుడు.. అది పెద్దయ్యాక తండ్రితో హైని

పుట్టినరోజున మొక్క నాటి..

చాట్రాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో నియోజకవర్గ టీడీపీ దళిత నాయకుడు నక్కా రాము చిన్న కుమార్తె హైని గుడ్‌న్యూస్ 2020 జూన్ 16న తన పుట్టిన రోజు నాడు ఇంటి పెరట్లో కొబ్బరి మొక్క నాటింది. అప్పుడు ఆమె టెన్త్ చదువుతోంది. ఇప్పుడు అది చెట్టుగా ఎదిగింది. మొక్క నాటిన హైని ఇప్పుడు నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. సోమవారం తన పుట్టిన రోజు వేడుకలు చేసుకున్న హైని తాను నాటిన మొక్క చెట్టుగా ఎదగటంతో ఆనందం వ్యక్తం చేసింది.

ముసునూరు ఏవోగా చాముండేశ్వరి బాధ్యతలు

ముసునూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల వ్యవసాయ అధికారిణిగా ఎం.చాముండేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కె.చిన సూరిబాబు జి.కొండూరు మండల ఏవోగా బదిలీపై వెళ్ళారు. నూజివీడు మండల ఏవోగా పనిచేస్తున్న ఎం.చాముండేశ్వరి ముసునూరు వచ్చారు. రైతుల సమస్యలు పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తానని చాముండేశ్వరి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

మోక్షం కలిగించరూ..

నిర్మాణంలోనే ఆగిన సచివాలయ భవనాలు

ఇరుకు గదుల్లో నిత్యం సిబ్బంది అవస్థలు

రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



పోలవరంలో అసంపూర్తి సచివాలయ భవనం

వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభమై పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సచివాలయ, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల భవనాలకు మోక్షం ఎప్పుడు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయని స్థానికులు అంటున్నారు. భవనాలు పూర్తి కాకపోవటంతో వివిధ శాఖల ఉద్యోగులు ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు.

చాట్రాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 16 గ్రామ సచివాలయాలు ఉండగా 8 గ్రామాల్లో భవనాల నిర్మాణం పూర్తయి ఉపయోగంలోకి వచ్చాయి. జనార్ధనవరం, చిత్తపూరు-1(ఆరుగొలనుపేట), పోలవరం, మర్లపాలెం గ్రామాల్లో సచివాలయ, రైతు సేవా, హెల్త్ సెంటర్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. చిత్తపూరు-2లో సచివాలయ భవనం పూర్తయి ఉపయోగంలోకి రాగా రైతుసేవా, హెల్త్ సెంటర్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. చిన్నంపేటలో మూడు భవనాలు సగం పూర్తి అయిన తరువాత కోర్టు కేసు కారణంగా ఆగిపోయాయి. చనుబండ-1లో సచివాలయ భవనం నిర్మాణం పూర్తయి ఉపయోగంలోకి రాగా, రైతు సేవా, హెల్త్ సెంటర్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. చనుబండ-2లో



చిత్తపూరు-1(ఆరుగొలనుపేట)లో..

సచివాలయ భవనం పూర్తయి ఉపయోగంలోకి రాగా, హెల్త్ సెంటర్ పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. రైతుసేవా భవనం అసంపూర్తిగా ఉంది. 2019 నాటి ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్ల)తో ఈ భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారు. ఆ రేట్లతో పనులు చేస్తే నష్టాలు వస్తాయని కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని 2025 ఎస్ఎస్ఆర్ ఇస్తే పనులు ప్రారంభించటానికి కాంట్రాక్టర్లు సుముఖంగా ఉన్నారు. రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు పెట్టి నిర్మాణం చేపట్టిన భవనాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదేశాలు రావాల్సి ఉంది

అసంపూర్తి భవనాల పనులు ఆపమని గానీ, కొనసాగించమని గానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. దీనిపై స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉంది. అసంపూర్తి భవనాలపై ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో ఈ భవనాల వివరాలను నమోదు చేస్తున్నాం.

- కాశీ, ఏఈ పంచాయతీరాజ్ శాఖ, చాట్రాయి మండలం.



డ్రైనేజీకి అడ్డుగా మట్టి ..

రహదారిపైకే మురుగునీరు

ముసునూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులంపాడు శివారు కొత్తూరులోని బీసీ కాలనీలో డ్రైనేజీకి అడ్డుగా మట్టి పోయడంతో మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వ్యక్తి డ్రైనేజీలో మట్టిని పోసి రోజులు గడుస్తున్నాయని, దీంతో డ్రైనేజీ పూడిపోయి నీరు నిల్వ ఉండటంతోపాటు రోడ్డుపై నీరు ప్రవహిస్తోందని కాలనీవాసులు చెబుతున్నారు. సమస్యను పంచాయతీ, సచివాలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళిన పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించేలా సంబంధిత మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గుడివాడకు చెందిన 400 కేవీ టీఎంసీసీ లైన్లకు కొత్త ట్రాన్స్‌మిషన్ల స్ట్రింగింగ్ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విజయవాడకు చెందిన ఏపీ ట్రాన్స్‌కో ఈఈ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామంలోని 132కెవి ఉప కేంద్రాల్లో తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆర్జీయూకేటీలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్జీయూకేటీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో స్పోర్ట్స్ విభాగంలో 62 మంది, ఎన్‌సీసీ 85, క్యాప్ విభాగంలో 12 మంది, భారత్ స్కౌట్ విభాగంలో 15 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు.

పేదరిక నిర్మూలనే ప్రధాని లక్ష్యం

నూజివీడుటౌన్, జూన్ 16(ఆంధ్రజ్యోతి):అవినీతి రహిత అభివృద్ధే ధ్యేయంగా సుస్థిర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ అన్నారు. నూజివీడు బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అధ్యక్షతన పట్టణంలో వికసిత్ భారత్ సంకల్పసభకు కోటప్రోలు కృష్ణ ముఖ్యవక్తగా విచ్చేసి మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యాచరణలో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో వికసిత్ భారత్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి కొనసాగింపుగా 16,17,18 తేదీల్లో గ్రామస్థాయిలో వీధిసభలను నిర్వహిస్తామన్నారు. అహ్మదాబాద్ విమానప్రమాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని పార్టీశ్రేణులు శ్రద్ధాంజలి ఘటించారు.

మండల కన్వీనర్‌గా రంగారావు

ఆగిరిపల్లి జూన్ 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కన్వీనర్‌గా సంగా రంగారావు, కో-కన్వీనర్‌గా మొగదాటి కోటేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం రాత్రి ఆగిరిపల్లిలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ జిల్లా పరిశీలకులు రవికాంత్, శివరాజు వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా పార్టీ పరిశీలకులు తెలిపారు.

బాలిక అదృశ్యం

ముదినేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్న బాలిక ఇటీవల తన అమ్మమ్మగారి ఇంటికి దేవపూడి వచ్చింది. సోమవారం ఉదయం తన తాత వేరేచోట పనిలో ఉండగా క్యారేజీ ఇచ్చేందుకు వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆ బాలిక ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం ఆ బాలిక అమ్మమ్మ ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

నూజివీడు నియోజకవర్గంలో..

పూర్తికాని టీడీపీ సంస్థాగత ఎన్నికలు

నూజివీడు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ మండల కమిటీల ఎన్నికలు ఇంకా పూర్తి కాలేదు. నూజివీడు రూరల్, నూజివీడు పట్టణ, ముసునూరు మండలాల కమిటీల ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల కమిటీల ఎన్నికలు పూర్తికావటంతో ఇప్పటికే ప్రకటించారు. చాట్రాయి మండలంలో కొన్ని గ్రామాల్లో ఇంకా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే నియోజవర్గంలో కొన్ని గ్రామాల్లో గ్రామ కమిటీల ఎన్నికలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఇప్పటికే ఎన్నికైన తెలుగుదేశం మండల కమిటీలను రద్దు చేసినట్టు తిరిగి నూతనంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరపటానికి అధిష్ఠానం నిర్ణయించినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పార్టీ శ్రేణుల్లో కలకలం రేపింది. పార్టీ కేంద్ర కార్యాలయం జారీ చేసిన ఎన్నికల విధి విధానాలు ఈ విధంగా ఉన్నాయి.

గ్రామ, వార్డు ఎన్నికలు

పార్టీ నిర్ధేశించిన తేదీల్లో పరిశీలకుడు వారికి కేటాయించిన మండలానికి వెళ్ళి గ్రామ, వార్డు పార్టీ సమావేశాన్ని నిర్వహించి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ప్రతిపాదనలు తీసుకోవాలి. ఈ ప్రతిపాదనలపై అభిప్రాయ సేకరణ జరగాలి.

కమిటీల రద్దు ప్రచారంతో కలకలం?

● పార్టీ గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపికలో ఆ పంచాయతీ పరిధిలోని బూత్ ఇన్‌చార్జిలు, కేఎస్ఎస్(కుటుంబ సాధికార సారథి)ల అభిప్రాయం తీసుకోవాలి. సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ఒకటే ప్రతిపాదన వచ్చినా, ఒకటి కంటే ఎక్కువ వచ్చినా ఆ వివరాలను , వారికి వచ్చిన మద్దతు వివరాల్ని పొందుపర్చి పార్టీ కార్యాలయానికి నివేదిక పంపాలి. నివేదికలో ఆ సమావేశానికి హాజరైన వారి సంతకాలను తీసుకోవాలి.

● ఒక పదవికి ఒకరి కంటే ఎక్కువ మంది పోటీ పడినప్పుడు, వారికెవరెవరు మద్దతు తెలిపారో వారి సంతకాలు తీసుకోవాలి. సమావేశంలో అనుబంధ కమిటీలకు కూడా ప్రతిపాదనలను తీసుకోవాలి. గ్రామ, వార్డు పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ పడేవారు పార్టీ క్రియాశీల సభ్యత్వం కలిగి ఉండి, కేఎస్ఎస్ సభ్యుడిగా ఉండాలి. ఇప్పటికే ఎక్కడైనా ప్రతిపాదనలు పంపినా, వాటిని కూడా పరిశీలకుల సమావేశం పెట్టి ఆ ప్రతిపాదనలను సమీక్షించి నివేదిక పంపించాలి.

మండల, డివిజన్, పట్టణ ఎన్నికలు

●పార్టీ నిర్ధేశించిన తేదీల్లో త్రిసభ్య పరిశీలకుల బృందం వారికి కేటాయించిన మండలానికి వెళ్ళి, మండల, డివిజన్, పట్టణ పార్టీ సమావేశాన్ని నిర్వహించి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ప్రతిపాదనలు తీసుకోవాలి. వీటిపై అభిప్రాయ సేకరణ జరగాలి.

●మండల, టౌన్ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక విషయంలో ఆ గ్రామ, వార్డు పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల అభిప్రాయం సేకరించాలి. ఈ సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్థానాలకు ఒకటే ప్రతిపాదన వచ్చినా, ఒకటి కంటే ఎక్కువ వచ్చినా ఆ వివరాలు, వారికి వచ్చిన మద్దతు వివరాలతో పార్టీ కార్యాలయానికి నివేదించాలి. ఈ నివేదికలో ఆ సమావేశానికి హాజరైన వారి సంతకాలను తీసుకోవాలి.

●మండల, డివిజన్, పట్టణ అధ్యక్ష పదవికి పోటీ చేసేవారు, సంబంధిత మండలంలో పార్టీ సభ్యత్వం కలిగి ఉండి కేఎస్ఎస్‌గా ఉండాలి. వరసగా మూడు పర్యాయాలు లేదా ఆరేళ్ల నుంచి పార్టీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న వారు ఈ పర్యాయం మండల పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేదు. వీరిని ఇతర సముచిత స్థానానికి వారి పనితీరు బట్టి ప్రతిపాదించవచ్చు. ఒకే పదవి ఒకరి కంటే ఎక్కువ మంది పోటీ పడినప్పుడు, వారికి ఎవరెవరు మద్దతు తెలిపారో వారి సంతకాలను తీసుకోవాలి. ఇప్పటికే ఎక్కడైనా ప్రతిపాదనలు పంపినా, వాటిని కూడా త్రిసభ్య పరిశీలకుల బృందం సమావేశం నిర్వహించి ఆ ప్రతిపాదనలను సమీక్షించి నివేదిక పంపించాలి. ఇదే సమావేశంలో అనుబంధ కమిటీలకు కూడా ప్రతిపాదనలు తీసుకోవాలి.



ముదినేపల్లి ఎంఈవో నరేష్ కుమార్‌కు మెమొరాండం అందజేస్తున్న కోడూరు యూపీ స్కూల్ ఎస్ఎంసి సభ్యులు, మహిళలు

పాఠశాల ఉంచాల్సిందే !

కోడూరు మహిళల ఆందోళన

ముదినేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోడూరులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ మహిళలు ఆందోళన బాట పట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియకుండానే మారు మూల గ్రామమైన కోడూరు యూపీ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చటం ఏమిటని ప్రశ్నిస్తూ సోమవారం ముదినేపల్లి మండల రిసోర్స్ సెంటరు వద్ద నిరసన తెలిపారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సభ్యులు, విద్యార్థుల తల్లుల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీవో వై.రామకృష్ణను కలసి తమ గ్రామంలో యూపీ పాఠశాలను స్కూలును కొనసాగించాలని మెమొరాండం అందజేశారు. అనంతరం మండల విద్యాధికారి నరేష్ కుమార్‌కు మెమొరాండం అందజేసి, యూపీ స్కూలు లేకుంటే తమ పిల్లలు 6, 7, 8 తరగతులు చదివేందుకు 8 కిలోమీటర్ల దూరంలోని పెదపాలపర్రు, ముదినేపల్లి హైస్కూళ్లకు ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. అంత దూరం పంపలేమని, అవసరమైతే చదువులు మాన్పించేందుకైనా సిద్ధమేనని మహిళలు ఎంఈవోకు స్పష్టం చేశారు. దీనిపై ఎంఈవో నరేష్ కుమార్ మాట్లాడుతూ స్కూలు కొనసాగించే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

వెదజల్లే పద్ధతి వైపే రైతుల మొగ్గు

కలిదిండి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సార్వా పంటను వెదజల్లే పద్ధతిలో సాగు చేయటానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. మేలో వర్షాలు సమృద్ధిగా కురవటంతో జూన్ నెల ప్రారంభంలో సార్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో విత్తనాలను వెదజల్లుతున్నారు. మండలంలో సుమారు 4 వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. కాల్వలకు సాగు నీరు కూడా విడుదల చేయటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

కైకలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కైకలూరు జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. సోమవారం హైస్కూల్ విద్యార్థులకు వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కైకలూరు వార్డు సభ్యులు కేవీఎన్ఎం నాయుడు, మంచిగంటి శ్రీనివాసరావు చేతులమీదుగా విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. హెచ్ఎం కె. విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు జీవీ సత్యనారాయణ, బి. శ్రీనివాస్, అవధాని, లీలాకుమారి, లావణ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.



కలిదిండిలో జలమయమైన ప్రధాన రహదారి



పెదపాలపర్రులో వెదజల్లిన పొలాల నుంచి నీటిని బయటికి పంపేందుకు రైతు తంటాలు

భారీ వర్షంతో పాట్లు..

కలిదిండి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కలిదిండిలో సోమవారం సాయంత్రం 4 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. బస్టాండ్, మార్కెట్ యార్డు సమీపంలో రహదారి నీటమునగటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం పూట తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారు భారీ వర్షం కురవటంతో ఉసూరుమంటూ ఇంటి ముఖం పట్టారు. అప్పటి వరకు వాతావరణం పొడిగా ఉండి అకస్మాత్తుగా మబ్బులు కమ్ముకుని గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవటంతో రహదారులు జలమయంగా మారి ప్రజలు అవస్థలు పడ్డారు.

మళ్లీ ముంపులో వెదజల్లిన వరి

ముదినేపల్లి: ముదినేపల్లిలో భారీ వర్షం కురిసింది. పాఠశాలలు వదిలిన సమయంలో వర్షం కురవటంతో దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్‌కు చేరుకు నేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షాలకు ముంపునకు గురై ఇప్పు డిప్పుడే తేరుకుంటున్న వెదజల్లిన వరి పొలాల్లో సోమ వారం నాటి వర్షం మళ్లీ ముంపునకు గురి చేసింది. దీంతో వెదజల్లిన పొలాల నుంచి నీటిని బయటికి పంపేందుకు బోదెలు ఏర్పాటు చేస్తున్నారు. వెదజల్లిన వరి విత్తనాలను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు.

రద్దీ సెంటర్లో భారీ గొయ్యి

ప్రమాదాల బారిన వాహనదారులు



కైకలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆ ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మూడు రోడ్ల కూడలిలో ప్రమాదకరమైన గొయ్యితో ఇబ్బందులు. భారీ వాహనాలు ఆ గోతిలో పడితే బయటకు వచ్చేందుకు ఎన్నో పాట్లు. కార్లు, వ్యానులు ఆ గొయ్యి వద్ద పల్టీ కొడుతున్నాయి. కైకలూరు పట్టణం కోరుకొల్లు రోడ్డు సెంటర్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం సమీపాన మలుపులో ఈ ప్రమాదకర గొయ్యి ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే సెంటర్ కావడంతో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గొయ్యి భారీగా ఏర్పడడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినా లేదా ఆదమరిచినా వాహనాలు ఆ గోతిలో పడి వాహనదారులు గాయాల పాలవుతున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గొయ్యి పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సహాయం



కైకలూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వృద్ధులు వివక్షకు గురైతే వారిని రక్షించేందుకు ప్రత్యేక చట్టాలున్నాయని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. సోమవారం కైకలూరు మండలం తామరకొల్లులోని మదర్ థెరిస్సా వృద్ధుల సేవా సంఘంలోని వృద్ధులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ వృద్ధులకు ఏ విధమైన న్యాయ సహాయం కావాలన్నా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచితంగా న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే ఎవరైనా వృద్ధుల పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారిని వేధింపులకు గురిచేసినా చట్టరీత్యా నేరమని కచ్చితంగా న్యాయస్థానం దృష్టికి తీసుకువస్తే వారికి శిక్ష పడుతుందన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయ శంకర్ వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. న్యాయవాదులు పి. పవన్‌కాంత్, వృద్ధాశ్రమం చైర్మన్ వై రఫాయిల్ తదితరులు పాల్గొన్నారు.